J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 18 7.10.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## ఆత్మీయ ఉత్సవం - అభినందనోత్సవం

## ఉక్కిరి బిక్కిరైన వెంకయ్య

అక్టోబర్ 3వతేది ఓ అసాధారణ వ్యక్తి ఆత్మీయ అభినందనోత్సవానికి నగరం అలంకరించుకుంది. అంచలంచెలుగా ఎదిగి అనితర సాధ్యమైన స్థానానికి ఎదిగిన నెల్లూరు ముద్దుబిడ్డను సత్కరించుకోవడానికి సింహపురి ముస్తాబయ్యింది. పల్లెసీమ నుండి తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది, అనేక రాజకీయ పదవులకు వన్నె తెచ్చి, భారతదేశ 13వ ఉపరాష్ట్రపతిగా రాజ్యాంగ పదవిలో సైతం తనదైన ముద్ర వేసుకుని పదవీ విరమణ తరువాత తొలిసారిగా జన్మభూమికి వచ్చిన ముప్పవరపు వెంకయ్యనాయుడికి ఆయన అభిమాన గణం నీరాజనాలు పట్టింది. ఈ అపురూప ఆనంద వేడుకకు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్ వేదికయ్యింది. అన్ని పార్టీలూ ఒక్కటై, అందరు నాయకులూ ఏకమై, 'అజాత శత్రువు మా వెంకయ్య' అని సందేశమిచ్చేలా అంగ రంగ వైభవంగా ఈ సత్కార సంబరం జరిగింది.

(వివరాలు 5, 10 పేజీలలో)

## అటకెక్కిన సెంటిమెంటు

# కేసీఆర్ ఢిల్లీకి.. తెలంగాణ గాలికి



*"కలిసోచ్చే కాలానికి నడిచొచ్చేకొడుకు పుడతాడు"*

*"టైం బాగాలేకపోతే తాడే పామై కరుస్తుంది"*

**పై రెండు సామెతలు ఒకే వ్యక్తికి వర్తించడం బహు అరుదుగా జరుగుతుంది. అలాంటి అరుదైన వ్యక్తులలో ఒకరుగా చరిత్రలో నిలిచిపోయే వారిగా తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గురించి జోస్యం చెప్తున్నారు రాజకీయ విశ్లేషకులు. సోనియమ్మ పుణ్యమా అని బూటాన్ బంపర్ లాటరీ తగిలినట్లుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం, సాదా సీదా మధ్యతరగతి కుటుంబం నుండి రాజకీయాలలోకి వచ్చిన కేసీఆర్ ఏకంగా ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవడం, 8 ఏళ్ళ కాలంలో అపర కుబేరుడిగా అవతరించడం... ఇవన్నీ మొదటి సామెతకు సరిపోతాయి.**

**కేంద్రంలో అధికారంలో ఉండి, దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులుగా పిలవబడుతున్న మోడీ & కోతో తగువు, ప్రపంచం మొత్తం మెచ్చుకుంటున్న 'సమతామూర్తి' వ్యవహారంలో జీయరస్వామిపై అలక, భాజపాతో విబేధించే క్రమంలో మజ్లిస్‌కి దగ్గరవడం, అన్నింటిని మించి బాగా కలిసోచ్చిన 'టీ.ఆర్.ఎస్' పార్టీ పేరుని మార్చి 'తెలంగాణ' సెంటిమెంటుని అటకెక్కించి 'బి.ఆర్.ఎస్'గా అవతరింప చేయడం... వంటి అంశాలన్నీ రెండవ సామెతకు సూటయిపోతాయి.**


భస్మాసరుడికి శివుడు వరమిచ్చినట్లుగా, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నెత్తిన చెయ్యి పెట్టమని సోనియమ్మ కేసీఆర్‌కి వరమిచ్చి జనం మీదకు తోలింది. అయితే ఇప్పుడు మోడీ రూపంలో మోహిని ప్రత్యక్షమై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను శాపవిముక్తులను చేసే దిశగా కేసీఆర్‌కి జాతీయ పార్టీ ఆలోచన కల్పించి ఆయన నెత్తిన ఆయనే చేయి పెట్టుకుని రాజకీయాల నుండి కనుమరుగయ్యే పరిస్థితులు కనపడుతున్నాయని రాజకీయ మేధావులు అంటున్నారు.

1999లో చంద్రబాబునాయుడు చంద్రశేఖరరావుకి మంత్రి పదవి ఇచ్చేసి ఉన్నా, 2009లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆకస్మికంగా మరణించి ఉండకపోయినా, రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కేసీఆర్ నిరాహార దీక్ష నాటకం చేపట్టినప్పుడు ఆయనను అరెస్ట్ చేసి ఊచలు లెక్కబెట్టించి ఉన్నా, చంద్రశేఖరరావు అనే వ్యక్తి ఈరోజు ముఖ్యమంత్రిగా ఉండే అవకాశమే లేదు. సియం హోదాలో ఈ 8 ఏళ్ళ కాలంలో దిక్కుతెలియనంత డబ్బు ఆయన ఖాజానాకి చేరడంతో ఇప్పుడు కేసీఆర్ దృష్టి మరలింది. ఆయనకిప్పుడు జాతీయ రాజకీయాలవైపు గాలి మళ్లింది. దేశ రాజకీయాలను శాసించాలన్న ఆలోచన కలిగింది. ఫలితంగా గల్లీ రాజకీయం కాస్తా ఢిల్లీకి చేరింది.

1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతిలో పరాభవానికి గురైన కె.చంద్రశేఖరరావు, తన రాజకీయ పునరావాసానికి, తిరిగి జనావాసంలోకి రావడానికి 'తెలంగాణ' అనే సెంటిమెంట్‌ను ఒక టిష్యూ పేపర్ లాగా వాడుకుంటున్నారని గతంలోనే అనేక సందర్భాలలో చాలామంది రాజకీయ విశ్లేషకులు, మేధావులు విమర్శించారు.

ఇప్పుడు ఆ విమర్శలు అన్నీ నిజమే అన్నట్టుగా వెలమదొర వ్యవహరిస్తున్నారు. 'తెలంగాణ' సెంటిమెంట్‌ను గాలికి వదిలేశారు. తెలంగాణ అభివృద్ధే నా లక్ష్యం, తెలంగాణ హక్కులు కాపాడడమే నా ధ్యేయం, బంగారు తెలంగాణ స్థాపనే నా తపన.... అంటూ ఆయన ఇంతకాలం చెబుతూ వస్తున్న మాటలు వట్టి బూటకం అనే విమర్శలు అప్పుడే ఆరంభమయ్యాయి. ఆంధ్ర నేతలను, ఆంధ్రులను బూచిగా తెలంగాణవాదులకు చూపిస్తూ వచ్చిన కేసీఆర్, ఇప్పుడు నోరు మెదపలేరు. కేసీఆర్ చెప్పే 'భారత రాష్ట్రం'లో ఆంధ్ర కూడా భాగమేకదా అంటూ సెటైర్లు పేలడం మొదలైపోయింది.

10లో



# పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ట్రైనీ కలెక్టర్లు



జిల్లాలో జాతిపిత గాంధీజీ చేతుల మీదుగా ప్రారంభమైన, ఇందుకూరు పేట మండలం పల్లిపాడులో ఉన్న పినాకిని గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని ఇటీవల జిల్లాకు వచ్చిన ట్రైనీ కలెక్టర్లు అన్నప్రియ, అర్పిత్‌గుప్తా, హరికీరత్‌సింగ్, పంకజ్‌యాదవ్, రత్నేష్‌చంద్‌జైన్, సోనమ్ టోష్టే, సౌమ్య రంజన్‌ప్రధాన్‌లు సందర్శించారు. ఆశ్రమం ఆవరణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమం చరిత్రను వారు అడిగి తెలుసుకున్నారు. తహశీల్దారు సుబ్బయ్య, ఆశ్రమ నిర్వాహకులు వారిని స్వాగతించి, చరిత్రాత్మకమైన ఈ ఆశ్రమం గురించి వారు వివరంగా తెలియజేశారు.

### క్షయ వ్యాధిగ్రస్తులకు..

# 'డామియన్ ఫౌండేషన్' వితరణ



క్షయతో బాధలు పడుతున్న పలువురు వ్యాధిగ్రస్తులకు నెల్లూరులోని డామియన్ ఫౌండేషన్ వారు పౌష్టికాహార సరుకులను పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకున్నారు. నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని క్షయ ఆసుపత్రి వద్ద ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి వెయ్యిరూపాయల విలువచేసే సరుకులను వితరణగా అందజేశారు. 'టీబీ ముక్తభారత్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. క్షయ నియంత్రణాధికారి జి.వెంకటప్రసాద్, ట్రస్ట్ మేనేజర్ సతీష్, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఉద్యోగులు పరమేశ్వరి, పిఎల్‌వి రావు, పీటర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్లు పంచిన..

# బిఎంఆర్ యువసేన



గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న బోగోలు మండలం ముంగమూరులో ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. షమీవుల్లా మిత్రబృందం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ చినబలరామయ్య, సిఐఎస్ఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరావు చేతుల మీదుగా పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బిట్రగుంట కృష్ణ, బి.సుధీర్, సిహెచ్ జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుళ్లో దొంగలుపడ్డారు

### వాశిలి రామాలయంలో.. పంచలోహ విగ్రహాలు మాయం

ఆత్మకూరు మండలం వాశిలి గ్రామంలో ఉన్న రామాలయంలో నాలుగు పంచలోహ విగ్రహాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఆదివారం రాత్రి పూజలు పూర్తయినతర్వాత తలుపులు వేసి, మళ్ళీ సోమవారం గుడివద్దకు వస్తే తలుపులు తెరచి ఉన్నాయని, లోపల విగ్రహాలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందడంతో, విచారణ కోసం పోలీసులు రంగంలోకి దిగారు. ఆలయంలోని సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని అనుకుంటున్న తరుణంలో గుళ్ళో దొంగలు పడడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరలించే తోపుడుబండిలో ఈ విగ్రహాలను దుండగులెవరో తరలించుకుపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు ఎస్ఐ శివశంకర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కోనలో నిత్యాన్నదానానికి..

# లక్షా వెయ్యిన్నూటపదహార్లు

పెంచలకోనలో నిత్యాన్నదాన పథకానికి ఆత్మకూరుకు చెందిన భక్తులు చేరెడ్డి మహాలక్ష్మమ్మ, ప్రసన్న, ప్రశాంతి, శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డిలు ఈనెల 2న లక్షా వెయ్యినూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించారు.



### అరుణాచల క్షేత్రానికి..

# ప్రత్యేక బస్సు

తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలం (తిరువన్నామలై)కు వెళ్ళి అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలనుకునే భక్తులకు, ఎంతో పుణ్యప్రదమైన 'గిరిప్రదక్షిణ' చేసుకోవాలనుకునేవారికి అనువుగా నెల్లూరు నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సును నడిపేందుకు ఆర్టీసి అధికారులు నిర్ణయించారు. ప్రతి నెల పౌర్ణమికి ముందురోజు నెల్లూరు-2వ డిపో నుంచి ఈ బస్సును నడుపుతామని డిఎం శివకేశవయాదవ్ తెలిపారు. అక్టోబరు 8వ తేది మధ్యాహ్నం 12 గంటలకు నెల్లూరులోని ప్రధాన ఆర్టీసి బస్టాండ్ నుంచి ఈ బస్సు బయలుదేరి, ముందుగా వేలూరులో గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని, రాత్రికి అరుణాచలానికి వెళ్తుందని చెప్పారు. అరుణాచలంలో భక్తులు గిరిప్రదక్షిణ పూర్తిచేసుకున్న అనంతరం ఆ బస్సు తిరిగి నెల్లూరుకు వస్తుందన్నారు. ఈ యాత్రకు 1200 రూపాయలను టిక్కెట్ ధరగా నిర్ణయించామని, ప్రయాణీకులు సర్వీస్ నంబర్ 95370లో ఆన్‌లైన్‌లో ముందస్తుగా సీట్లు రిజర్వు చేసుకోవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# సజ్జల కొనుగోళ్లకు రెడీ

జిల్లాలో పండించిన సజ్జలను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, వాటిని విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. సజ్జలు క్వింటాలు ధర 2,350 రూపాయల వంతున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు.

### సిద్ధనకొండూరు

# జడ్పీ విద్యార్థినుల ప్రతిభ

కలిగిరి మండలం సిద్ధనకొండూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన చిలకపాటి నాగ దీప్తి, వంగపాటి శ్రీనవ్య, ఎస్.ప్రత్యూష, కొండ్రాజు లక్ష్మీభార్గవిలు ఇటీవల ట్రిబుల్ ఐటీ పరీక్షల్లో ఉత్తమశ్రేణి మార్కులతో సీట్లు సాధించారు. పాఠశాల కమిటీ ఛైర్మెన్ అంబటి మాల్యాద్రి, హెడ్మాస్టర్ లక్ష్మీ కాంతం ఆ బాలికలను అభినందించారు.

### పశువులకు

# టీకా వచ్చింది

పశువుల్లో లంపీ స్కిన్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు టీకా వచ్చిందని, పాడిరైతులు ఈ టీకాలను పశువులకు వేయించాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత సూచించారు. తొలిదశలో 1500 డోసుల టీకాలు వచ్చివున్నవని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఆలయాల దొంగలు దొరికారు



వ్యసనాలకు బానిసలై డబ్బు కోసం ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు వెంకటాచలం పోలీసులకు దొరికిపోయారు. నెల్లూరు రూరల్ డిఎస్పీ హరినాథ్‌రెడ్డి ఈనెల 3న వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. నెల్లూరులోని కోటమిట్టకు చెందిన షేక్ షహీద్, కొత్తూరు వద్దనున్న టైలర్స్‌కాలనీలో ఉంటున్న షేక్ షాబీద్‌లు పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. గతంలో రాపూరు మండలంలోని గోను నరసాయపాలెంలో మాతమ్మ గుడిలో అమ్మవారి మంగళసూత్రాన్ని అపహరించారని, సంక్రాంతిపల్లి రామాలయంలోను హుండీలను చోరీలు చేశారని, ఇటీవల వెంకటాచలం మండలం అనికేపల్లి గ్రామంలో అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీని అపహరించి నగదు దోచుకున్నారని, వెంకటాచలంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీ చోరీ చేశారని, దీంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈనెల 3న నిందితులను అరెస్ట్ చేసి వారినుంచి 7వేల రూపాయలతో పాటు 3 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ చౌడేశ్వరి పర్యవేక్షణలో వెంకటాచలం సిఐ గంగాధర్, ఎస్ఐ అయ్యప్ప తమ సిబ్బందితో కలసి చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేశారని వారిని డిఎస్పీ అభినందించారు.

### రోడ్డు బాగుచేయాలంటూ..

# బురదలో పొర్లుదండాలు

- కావలిలో టిడిపి వినూత్న నిరసన



తుమ్మలపెంట రోడ్డు బాగుచేయాలని ఎంతోకాలం నుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తూ కావలి టిడిపి నాయకులు బురదనీటిలో పొర్లుదండాలు పెట్టారు. కావలి పట్టణం నుంచి తుమ్మలపెంట గ్రామానికి వెళ్ళే రోడ్డు పరమ అధ్వాన్నంగా ఉందని, రోడ్లు భవనాల శాఖ అధికారులకు చెప్పినా నేటికీ దాని అతీగతీ పట్టించుకోలేదని వారు విమర్శించారు. టిడిపి కావలి నియోజకవర్గ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని బురదమడుగులోనే కూర్చుని ఆందోళన చేశారు. టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబూరావు బురదలో పొర్లాడుతూ నిరసన తెలిపారు. సముద్ర తీరగ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ముఖ్యమైనదని, వేలాది వాహనాలు నిత్యం ఈ ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయని, రోడ్డు బాగాలేక గుంతలుమిట్టలు ఏర్పడి ప్రమాదాలకు దారితీస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తుమ్మలపెంట పర్యాటక ప్రాంతానికి వెళ్ళే ఈ రోడ్డును ఇకనైనా వెంటనే బాగుచేయాలని కోరారు. టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, శ్రీహరినాయుడు, టి.వాసు, పి.శ్రీకాంత్, ప్రసాద్, మత్స్యకారులు పాల్గొన్నారు.

# విఎస్‌యులో గాంధీ జయంతి

### ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుల జయంతి వేడుకలు



నెల్లూరు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అక్టోబరు 2న మహాత్మా గాంధీజీ, మరియు లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి. రామచంద్రారెడ్డి ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి త్యాగాలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా. జి సుజయ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్నాపై రెండో బ్రిడ్జి...

# ఆలోచన.. మంచిదే



- ఎంపీ ఆదాల

ఎంతో రద్దీ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో నెల్లూరు వద్ద పెన్నానదిపై రెండో బ్రిడ్జి ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేయడం మంచిదేనని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దాదాపు 100 కోట్ల రూపాయలతో కొత్తగా నిర్మించ తలపెట్టిన రెండో బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో దాదాపు 600 కోట్ల రూపాయలతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని తెలిపారు. వంద కోట్లతో పెన్నాబ్రిడ్జి, మరో 100కోట్లతో కరకట్ట పనులు, 200కోట్ల రూపాయల వ్యయంతో ఇరిగేషన్ కాలువల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంత జరుగుతున్నా తెలుగుదేశం పార్టీ నేతలు అభివృద్ధేమీ జరగలేదని విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. నెల్లూరు హైవే మీద 3 ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రాజెక్టుల సాధనకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైల్వే, టూరిజం, హైవే పనులను శ్రద్ధతో చేస్తున్నామని చెప్పారు. గతంలో వైయస్ హయాంలో, ప్రస్తుతం జగన్ హయాంలో ఇరిగేషన్ పనులు త్వరగా జరుగుతున్నాయని తెలిపారు.

# వైకాపా నాయకులు.. ఇకనైనా మారాలి

## జనసేన నేత చెన్నారెడ్డి మనుక్రాంత్



వైకాపా నాయకులు ఇకనైనా మారాలని, హింసాత్మక విధానాలను వారు విడనాడాలని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న నెల్లూరులో ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింసాత్మక ధోరణితో ఉన్న వైకాపాకి గాంధీజయంతి జరిపే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. ఎక్కడ చూసినా దాడులు, దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీజీ జయంతి సందర్భంగానైనా వైకాపా నాయకులు మనసు మార్చుకొని హింసాత్మక పాలనను విడనాడాలని కోరుకుంటున్నానన్నారు. పంచాయతీ నిధులు లేక గ్రామాలు అల్లాడుతున్నాయని, అయినా గ్రామస్వరాజ్యం విషయం పట్టించుకోవడం లేదని, మద్య పానం వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతాయని గాంధీజీ తెలిపారని, ఇప్పుడు ప్రభుత్వమే మద్యం అమ్ముతుండడం దారుణమన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ గాంధీజీ బాటలో పయనిస్తూ... ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని, తమ సొంత నిధులు దాదాపు 30 కోట్ల రూపాయలను ఆయన కౌలురైతుల సహాయార్థం ఇచ్చారని గుర్తుచేశారు. గునుకుల కిషోర్, సుజయ్‌బాబు, కొట్టె వెంకటేశ్వర్లు, బద్దిపూడి సుధీర్, ఆలియా, అజయ్, వర్షన్, అలేఖ్, సుబ్బు, హరి తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతుల సౌజన్యంతో..

# దివ్యాంగులకు వస్తుసామగ్రి



పదారుపల్లి, దివ్యాంగుల కాలనీలోని పి.సి.రెడ్డి సమాజ మందిరంలో ఈ నెల 2వ తేదీన క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. పొలంత గాంధీ, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్ విగ్రహాలకు 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ కార్పొరేటర్ పుల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతుల సౌజన్యంతో 35 మంది దివ్యాంగులకు సామాగ్రిని అందజేశారు. అందరికీ ఆహారపొట్లాలు అందజేశారు. సమాజ మందిరంలోని మహాత్మునికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు కమలాకర్ ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ అలరించాయి. సాయి సుధాకర్, వీరిశెట్టి సుధాకర్, లింగారెడ్డి, లతీఫ్, కుసుమకుమారి, డి.రాధాకృష్ణ, గోపీనాథ్‌రెడ్డి, సుందరరామిరెడ్డి, మాధవి, వృద్ధులు పాల్గొన్నారు.

# వలంటీర్ వ్యవస్థ అద్భుతం

## • కితాబిచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లు



రాష్ట్రంలో అమలులో ఉన్న గ్రామ సచివాలయ వ్యవస్థ అద్భుతమంటూ జిల్లాను ఇటీవల సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం కితాబిచ్చింది. శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు అర్పిత్ గుప్తా, హర్‌కీరత్‌సింగ్, పంకజ్ యాదవ్, సమీక్ష రత్నేష్‌చంద్ జైన్, సోనం టాబ్గే, సౌమ్య రంజన్ ప్రధాన్ తదితరులు క్షేత్రస్థాయిలో సచివాలయ వ్యవస్థ అమలవుతున్న తీరును పరిశీలించి తమ అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు తెలియజేశారు. వారు వెలిబుచ్చిన అంశాలపై తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వింజమూరు మండలం ఊటుకూరు గ్రామంలో నాలుగు రోజులు పాటు బసచేసి అధ్యయనం చేసిన వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను ట్రైనీ కలెక్టర్లు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఊటుకూరులో పంచాయతీరాజ్ కార్యకలాపాలు, గ్రామీణ ఆరోగ్యం, విద్యా విధానం, వ్యవసాయం, తాగునీటి సౌకర్యం, గ్రామీణ యువత ఉపాధి అవకాశాలు అనే అంశాలపై అధ్యయనం చేశామని, గ్రామంలో అమలవుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తున్నాయని, ఇవి గ్రామాభ్యుదయంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారమన్నారు. అదేవిధంగా 108, 104, 102 సేవలు బాగున్నాయన్నారు. గ్రామంలోని వివిధ కుటుంబాలకు సంబంధించిన సమాచారం సచివాలయం, వాలంటీర్ల ద్వారా అందుబాటులో ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలు ఆయా వర్గాల వారికి సులువుగా అందుతున్నాయన్నారు. గ్రామంలోని ఏఎన్ఎం, ఆశా వర్కర్స్ పనితీరు కూడా బాగుందన్నారు. ఆ గ్రామంలో పాముకాటుకు గురైనవారు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్, త్రాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం ఈ గ్రామంలో చక్కగా ఉన్నాయన్నారు. దూర ప్రాంత పాఠశాలలకు రవాణా సౌకర్యం కల్పించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. బాలికలకు పదవ తరగతి పూర్తవగానే చదువు మాన్పించి పెళ్లిళ్లు చేస్తున్నట్టు గమనించామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, డిఆర్‌డిఏ పీడీ సాంబ శివారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు, డిఇఓ రమేష్, సర్వశిక్ష ఏపిసి ఉషారాణి, డిపిఓ ధనలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ ఉమామహేశ్వరి, దివ్యాంగుల సంక్షేమ అధికారిణి నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

జిల్లాలో నాబార్డ్ సహకారంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ గురువారం నెల్లూరు, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నాబార్డు నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నాబార్డ్ నిధులతో చేపడుతున్న వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతి, విడుదలైన నిధుల వివరాలను నాబార్డు డిడిఎం రవిసింగ్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి నాబార్డు నిధులు ఎంతో ఉపయోగపడతాయని, అధికారులందరూ నాబార్డు ద్వారా మంజూరైన అన్ని పనులను త్వరితగతిన మొదలుపెట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనులకు సంబంధించి బిల్లులను త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు శివారెడ్డి, రంగవరప్రసాద్, సమగ్రశిక్ష, ఏపీ ఈడబ్ల్యుఐడిసి ఈఈలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే.. రైతులకు మీటర్లా?..

## - మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ఆరోపణ



మీటర్ల కంపెనీల వద్ద కమీషన్లు, కేంద్రం వద్ద అదనపు అప్పుల కోసమే మీటర్లపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఆసక్తి చూపుతోందంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో మోటార్లకు మీటర్లను ఒప్పుకునేది లేదని, రైతులతో కలిసి ఉద్యమిస్తామని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టంచేశారు. ఇటీవల ఆయన నెల్లూరులో విలేకరులతో రైతన్నల సమస్యలను ఏకరువు పెట్టారు. ఏపీలో 18 లక్షల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేస్తామని మంత్రి పెద్దిరెడ్డి సెలవిచ్చారని, శ్రీకాకుళంలో ట్రయల్ రన్‌గా మీటర్లుపెడితే 30శాతం విద్యుత్ ఆదా అయిందని, అందుకని అంతా పెట్టేస్తామంటున్నారని ఆయన అంటూ, మీటర్లు పెడితే 30శాతం ఆదా అయిందంటే, ఆ విద్యుత్‌ను రైతులు దొంగతనం చేస్తున్నారని ప్రభుత్వం భావిస్తోందా అని ప్రశ్నించారు. కేవలం అప్పుల కోసం ఎఫ్.ఆర్.బీ.ఎం రేటింగ్ పెంచుకోవడం కోసమే ఏపీలో ప్రభుత్వం రైతుల గొంతు కోస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మీటర్ల కోసం రూ.4,500 కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఆ డబ్బులో కమీషన్ల కోసం కూడా ప్రభుత్వ పెద్దలు మీటర్లపై ఆసక్తి చూపుతున్నారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇస్తుంటే, తాను అధికారంలోకి వస్తే 12 గంటలు ఇస్తానని జగన్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే 9 గంటలను 7గంటలకు తగ్గించారని ఆయనన్నారు. ఒక్క వ్యవసాయానికే కాదు..పరిశ్రమలు, ఇళ్లకు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయానికి 12 గంటలు ఇస్తామన్న కరెంటును 7గంటలకు తగ్గించడం ద్వారా ఈ ప్రభుత్వం ఇప్పటికే 42శాతం విద్యుత్‌ను దొంగచాటుగా ఆదా చేసుకుంటోందన్నారు. శ్రీకాకుళంలో 30 శాతం ఆదా అయితే తెలంగాణ సీఎం కేసీఆర్ అమాయకుడై ఆ రాష్ట్రంలో మీటర్లు పెట్టడం లేదా అని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని స్పష్టం చేశారని, దేశంలోని సగం రాష్ట్రాలు అదే నిర్ణయంతో ఉన్నాయని, దేశవ్యాప్తంగా వస్తున్న ఒత్తిడితో కేంద్ర కేబినెట్ కూడా మీటర్ల విషయంలో వెనక్కి తగ్గిందని, ఏపీలో మాత్రం మీటర్లు పెట్టేదే అనడం వైకాపా నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు.

రాష్ట్రంలో రైతులపై జగన్‌రెడ్డి ప్రభుత్వం కక్షకట్టిందని, ప్రభుత్వ నిర్ణయాలతో ఇప్పటికే వ్యవసాయ రంగం కుదేలైపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఆరేడు నెలలకు కూడా డబ్బు కట్టడం లేదు.. వీళ్ల మళ్లీ కరెంట్ బిల్లులకు డబ్బులు వేస్తారంట!..అని ఆయన ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఇచ్చిన డబ్బును కూడా ఉచితంగా ఇచ్చినట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ, ఏ ఒక్కరు కూడా మీటరు పెట్టడానికి అంగీకరించవద్దని ఆయన పిలుపునిచ్చారు.

లాయర్
అక్టోబర్ 07, 2022

# బాలికల బాధలు తీరేనా?

ఆడపిల్ల పుట్టిందంటే లక్ష్మీదేవి పుట్టినట్లే. అమ్మాయి ఇంట్లో తిరుగుతుంటే ఆనందమంతా మన ఇంట్లో ఉన్నట్లే!.. వారి చిరునవ్వులతో ఆ కుటుంబమంతా కష్టాలను మరచి పోతుంది. పాతకాలంలో ఆడపిల్ల పుట్టిందంటే చాలు..ఇల్లంతా సంబరాలే. లేత మనసులు, సున్నితమైన మనస్తత్వం, సుకుమారమైన ఆలోచనలు, చిన్నతనం నుంచి పదిమందికీ సాయం చేసే తత్వం, అమ్మానాన్నలకు, తోడబుట్టినవాళ్ళకు ఆత్మీయతను పంచే మంచి మనస్తత్వం బాలికలకు పుట్టుకతో వచ్చే సుగుణాలు. ఆడపిల్లల్లో ఉండే ఆప్యాయతానురాగాలకు.. ప్రేమాభిమానాలకు కొలమానాలు ఉండవు. అందుకే, పుడితే ఆడపిల్లే పుట్టాలి..కంటే కూతుర్నే కనాలి.. అనుకునే వాళ్ళు!... అయితే, క్రమేణా ఆ రోజులు పోయాయా అనిపిస్తోంది. బాలికలంటే బాధలే అన్నట్లుగా తయారైన కాలమిది. పాతకాలంలో రోతపద్ధతులున్నా, ఆచారాలు సంప్రదాయాల పేరుతో బాలికలకు కష్టాలే ఎదురైనా, ఎట్లనో ఆ కాలం గడిచి పోయింది. ఇప్పుడంతా అధునాతన కాలం. అన్ని ప్రాంతాలు మెల్లమెల్లగా అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. పాతరోజుల్లో ఆడపిల్లకు చదువెందుకు అనేవారు. బడులకు పంపేవారు కాదు. ఇప్పుడు ఆడపిల్లలే మగపిల్లల కంటే బాగా చదువుకుంటున్నారు. నేటి బాలికలే రేపటి మహిళలు. వారే కుటుంబాన్ని చక్కదిద్దే గృహిణులు. జీవితాంతం భర్తకు తోడుండేది భార్యే. వారే తల్లులు. వారే చెల్లెళ్ళు, అక్కలు. వారు లేకుంటే సమాజమే లేదు. అన్ని రంగాల్లోనూ మగవారికంటే మహిళలే మెరుగ్గా రాణిస్తున్నారు కూడా. అందుకే సమాజంలో బాలికల పాత్ర ఎంతో కీలకం. ఆధునికశాస్త్ర పరిజ్ఞానం శరవేగంగా విస్తరిస్తున్నా ప్రపంచంలో నేటికీ ఆ పసిమొగ్గల పట్ల ఇటు కుటుంబ పరంగా, అటు సామాజికపరంగా ఇంకా అన్యాయాలు, అమానుషాలు జరుగుతుండడమే బాధాకరం. ప్రపంచంలోని అనేక దేశాల్లో బాలికల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. పేదరికం, కుటుంబాలను పోషించలేని పరిస్థితి, కుటుంబ పెద్దలు చదువుకోక అమాయకంగా అజ్ఞానంలో ఉండడం వంటివన్నీ అందుకు ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి. కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడే మనస్తత్వం ఇంకా పోలేదు. సమాజం ఆధునికంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నా ప్రపంచంలో కోట్లాదిగా బాలికలు ఇంకా అంధకారంలోనే ఉంటున్నారు. పేదరికం వల్ల చదువు సంధ్యలు లేకపోవడం, కుటుంబ పోషణకు నిత్యం పని పిల్లలుగా ఉంటూ చాకిరీలో మగ్గిపోతున్న పసిపిల్లలు ఎందరో!.. మనదేశంలోనూ ఆడపిల్లల పరిస్థితి గతంలో కంటే ఇప్పుడు కొంత మెరుగుపడినా, బాగుపడాల్సింది ఎంతో ఉంది. బాలికల పట్ల ఇంకా చిన్నచూపు పోవడం లేదు. ముఖ్యంగా భద్రత కరువైపోయింది. ఎన్నిరకాల చట్టాలున్నా దేశంలో బాలికలపై అఘాయిత్యాలు నానాటికీ పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. బయటకు స్వేచ్ఛగా వెళ్ళాలంటే భయమే. ఎక్కడ చూసినా ఇంకా అభద్రతాభావమే. రక్షణ లేదు. ఈ దురవస్థలన్నీ తొలగిపోవాలి. మగపిల్లలతో పాటు ఆడపిల్లలను కూడా సమానంగా చూడాలి. వారికీ సముచిత గౌరవం ఇవ్వాలి. బాలికలకూ హక్కులున్నాయి. వాటిని అందరూ పరిరక్షించాలి. బాలికల సంరక్షణలోనూ, పోషణలోనూ, వారికి విద్య-వైద్యం ఇతరత్రా వసతులు కల్పించడంలోనూ, సామాజికంగా వారిని కూడా ఎదగబెట్టడంలోనూ ప్రతిఒక్కరూ మానవీయదృక్పథంతో సహకరించాలి. ఆడపిల్లల పట్ల లింగ అసమానతలకు, లైంగిక వేధింపులకు పాల్పడకూడదు. బాల్య వివాహాలను ఎట్టిపరిస్థితులలోనూ ఎక్కడా అనుమతించకూడదు. అందుకు ఇంకా అవసరమైన చట్టాలను మరింత పటిష్టం చేయాలి. బాలికల హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసి, ఆ కష్టాల నుంచి వారిని కాపాడేందుకు ప్రపంచ దేశాలన్నీ కలసి 1995లో ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ప్రతిఏటా అక్టోబరు 11వ తేదీన 'అంతర్జాతీయ బాలికల దినోత్సవం' ఏర్పాటైంది. బాలికలను అన్నివిధాలా పరిరక్షిస్తూ, వారి పట్ల మరింత బాధ్యతగా, గౌరవంగా ఉండాలన్నదే దాని సారాంశం.అందుకోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి. బాలికల పురోభివృద్ధికి ప్రభుత్వాలు మరింతగా కృషి చేయాలి. ఆడపిల్లలు ఆనందంగా ఉండే రోజులు రావాలి. ఆడపిల్ల కంట తడిపెట్టకూడదు. వారి చిరునవ్వులు చెరిగి పోకూడదు. ఈ గురుతర బాధ్యత ఏ ఒక్కరిదో కాదు.. పాలకులది.. ప్రభుత్వాలది మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరిదీ!.. మనదేశంలోనే కాదు... ప్రపంచంలోని ప్రతి ఒక్కరిదీ!...

(అక్టోబరు 11..'అంతర్జాతీయ బాలికల దినోత్సవం)

# హారన్‌ల మోత.. సైలెన్సర్ల రోత




మనవాళ్ళు ఏమాత్రం పట్టించుకోని నిబంధనల్లో 'ప్లీజ్ డోన్ట్ హారన్' అనేదొకటి. అందులోనూ కొందరు కుర్రకారు తమ మోటార్‌బైక్‌లకు ఉన్న సైలెన్సర్లను తీసిపారేసి పెద్ద శబ్దంతో బడబడమంటూ రోడ్లమీద వేగంగా తిరుగుతుండడం సర్వసాధారణమైపోయింది. ఆ మిడిమేళం చూస్తే.. రోడ్లమీదున్న జనానికి గుండెలు జారిపోతుంటాయి. అలా.. కర్ణకఠోరమైన శబ్దంతో రోడ్లమీద హారన్‌లు మోగించుకుంటూ వెళ్ళే వాహనాలు పట్టణాలు, నగరాల్లోనే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇప్పుడు లెక్కలేనన్ని. ప్రత్యేకించి నెల్లూరు నగరంలోనూ ఇలాంటి రోతపుట్టించే మోతలకు కొదవే లేదు. ఒకే మోటార్‌బైక్‌లో కనీసం ముగ్గురు నలుగురు ఎక్కేస్తారు. విద్యార్థులో, యువకులో ఎవరైతేనేం.. సర్రున రోడ్డుపైకి వచ్చి బర్రుమంటూ దూసుకుపోతుంటారు. సైలెన్సర్ తీసేసిన ఆ బండి నుంచి వచ్చే శబ్దం వెయ్యి హారన్ల మోతకన్నా ఎక్కువుంటుంది. ఒక్కసారిగా రోడ్డుమీద పోతున్నవాళ్ళంతా బితుకుబితుకుమంటూ ఆ బండి వైపు చూస్తుంటే.. అదేదో పెద్ద హీరోయిజమ్‌గా ఆ కుర్రోళ్ళు ఫీలవుతుంటారు. తెల్లవారి పేపర్లో చూస్తే.. ఇలాంటి మోటార్‌బైకే ఒకటి ఏ లారీ కిందకో దూసుకుపోయి నుజునుజ్జు అయివుంటుంది. బండిమీదున్నవాళ్ళు ఏ ఆసుపత్రుల్లోనో మూలుగుతుంటారు. దీంతో కన్నవాళ్ళకి కళ్ళనిండా విషాదం.. రోడ్ల మీద వెళ్ళే మరో వాహనానికి కూడా దీనివల్ల ప్రమాదం. ఇవన్నీ నిత్యం చూస్తున్నవే. అయినా మనవాళ్లకి బుద్ధి రావడం లేదు. బండి నడిపేందుకు లైసెన్సు లేకపోయినా నడిపేసి లేనిపోని న్యూసెన్సు సృష్టిస్తుంటారు. కొంతమంది కార్లకి కూడా సైలెన్సర్లను తీసేసి ఇదే తరహాలో మోతమోగిస్తూ రోత పుట్టిస్తుంటారు. వాహనదారుల్లో ఎక్కువ మందికి హారన్ గట్టిగా మోగిస్తూ వెళ్ళడం హాబీ. వాహనాల లోపల కూర్చుని

## సమస్యల తో 'రణం'

హారన్ పెద్దగా మోగించేవాళ్ళకి అది ఇంపుగా ఉంటుందేమో కానీ, బయటున్నవారిని బెంబేలెత్తిస్తుంటుందా శబ్దం. అసలు అత్యవసరమైతే తప్ప హారన్లు మోగించకూడదు. అందుకే రోడ్లమీద కొన్ని ప్రాంతాల్లో హారన్‌లు మోగించొద్దని, అందులోనూ చెవులు చిల్లులు పడేలా హారన్‌లు ఎక్కడా మోగించకూడదని బోలెడన్ని నిబంధనలైతే ఉన్నాయి కానీ, ఎవరు పట్టించుకుంటున్నారు గనక!.. ఆసుపత్రులు, న్యాయస్థానాలు వంటి ప్రాంతాల్లో 'డోన్ట్ హారన్' బోర్డులున్నా, వాహనదారులు వాటిని చూసినా తలకెక్కించుకోని వారెందరో!.. అత్యవసర రోగులను శరవేగంగా తీసుకువెళ్ళే అంబులెన్సులకు దారివ్వాలని కూడా తెలియని వాహనదారులెంతోమంది ఉన్న నేటి రోజుల్లో.. ఇలాంటి సామాజికపరమైన నిబంధనలు తెలియనివారు కొందరు, తెలిసినా బేఖాతర్ చేసేవారు మరికొందరు. మొత్తమ్మీద దాదాపు అందరూ ఇలాంటి శబ్ద కాలుష్యాన్ని తమవంతు బాగా పోషిస్తూనే ఉన్నారు. రోడ్లమీదికొస్తే చాలు, అందరికీ అర్జంటే. వాహనదారులు రెచ్చిపోయి అదే పనిగా పెద్దపెద్దగా హారన్ మోగిస్తుంటారు. ట్రాఫిక్‌లో.. ముందు వాహనాలు కదలడం లేదని అదేపనిగా హారన్‌ల మోత! ఈ భయంకరమైన హారన్ల మోతలు ఎంతకాలం భరించాలి?..నిత్యం వేలాది వాహనాలు అదేపనిగా హారన్‌లు ఇష్టానుసారం మోగించేస్తుంటే శబ్దకాలుష్యం ఎక్కువకాక ఏమవుతుంది?.. ఈ తరహా కాలుష్యాన్ని కూడా నియంత్రించే విధానాలు పెద్దపెద్ద నగరాల్లో ఉంటాయి. నిర్దేశిత పరిమితి (80 డెసిబుల్స్)కి మించి హారన్‌లు మోగిస్తున్న వాహనాలను గుర్తించేందుకు కూడా అకౌస్టిక్ కెమెరాలున్నాయి. దాంతో జరిమానాలూ జారీ అవుతాయి. ఇలాంటి లేనిపోని సరంజామా అంతా లక్షలు పోసి తెచ్చి నెత్తి నేసుకోవడం మనకవసరమా?.. హారన్లు మనచేతిలోనే కదా ఉంటాయి. వాటిని ఎంతవరకు అవసరమో అంత వరకే వినియోగిస్తే సరిపోతుంది కదా!.. ఇవన్నీ మరొకరు చెప్పాల్నా?.. ప్రభుత్వాలు మన వెంటపడి జరిమానాలు వెయ్యాల్నా?.. ఎందుకీ అవస్థ!.. ఇక్కడొక సంగతి. ఇలాంటి రోతలన్నీ పోయేలా కేంద్రప్రభుత్వం ఓ కొత్త ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. రోత పుట్టించే హారన్లు తీసేసి ఇకనుంచి కొత్త హారన్లు, అవికూడా ఏ వేణువు ఊదినట్లుగానో, లేదా వీణ మీటినట్లుగానో చెవులకు హాయిగా ఉండే హారన్లు పెట్టాలని ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మంచిదే! అంతకన్నా కావాల్సిందేముంది?..వాటిని స్వాగతించాల్సిందే. అయితే, వినసొంపైన హారన్లు పెట్టినా, మనోళ్లు కొంతమంది అసలు హారన్లు, సైలెన్సర్లను కూడా తీసేసి రోడ్లమీద మోత మోగించేస్తుంటే, ఇక శ్రావ్యమైన హారన్లు వచ్చినా మన చెవులకు వినపడేదెప్పుడు?..ఏదేమైనా, వాహనదారులే అందుకు బాధ్యత తీసుకుని ఎవరికి వారు ఈ శబ్ద కాలుష్యాన్ని నివారించాలి. ఇళ్ళల్లో ఉండే పెద్దలు, తమ పిల్లలు అంత ఘోరంగా రోడ్లమీద హారన్లు కొట్టుకుంటూ, లేదా సైలెన్సర్లను తీసేసి బరబరమంటూ అందరికీ రోత పుట్టిస్తున్నారన్న విషయాన్ని గమనించి, నియంత్రిస్తే ఈ సమస్య చాలావరకు తగ్గుతుంది. పోలీసులు, ట్రాఫిక్ అధికారులు కూడా ఇలాంటి వాటిపై దృష్టిపెట్టి, అలాంటి వాహనదారులకు తరచూ కౌన్సిలింగ్ ఇస్తుండాలి. ఏదేమైనా.. హారన్ల వినియోగాన్ని ఎవరికి వారు బాగా తగ్గించి, ఎప్పుడు అవసరమో, ఎంతమేరకు అవసరమో అంతవరకే వినియోగిస్తే ఈ బాధలన్నీ ఉండవు కదా!.. ఇకనైనా ఆ మోతపుట్టించే రోత హారన్లు వాడవద్దని, సైలెన్సర్లు తీసేయవద్దని, ముఖ్యంగా.. రోడ్లమీద వెళ్తున్న సాధారణ ప్రజల చెవుల్ని కాపాడాలని, ఆ హారన్ల భయానికి దారిన పోయే వృద్ధులకి గబుక్కున ఏ గుండెపోటో రాకుండా చూడాలని..పదేపదే ప్రార్థన!..

- సంచారి

# అక్షరదీపాలు.. మళ్ళీ వెలగాలి

నెల్లూరుజిల్లాలో గతంలో అక్షరాస్యత ఉద్యమం జోరుగా జరిగింది. నిరక్షరాస్యులకు చదువు చెప్పే అక్షరకేంద్రాలు, వయోజనులు వెళ్ళి చదువుకోవడాలు.. ఊరు ఊరంతా సందడిగా ఉండేది. మొదట్లో పెద్దలు ఈ బడులకు వెళ్ళి చదువుకోవడం అన్నది నామోషీ అనిపించినా, తర్వాత మెల్లగా చదువుకోవడానికి అలవాటు పడ్డారు. వేలాదిమంది అక్షరాభ్యాసం చేసి, కొద్దోగొప్పో చదువుకున్నారు కూడా. అప్పట్లో చదువుకున్నవాళ్ళు, అధికారులు, అయ్యవార్లు, సమాజసేవా సంస్థల వారు, కవులు, కళాకారులు అందరూ ఈ ఉద్యమానికి ఎంతో సహకరించారు. దీంతో కొంతమేరకు జిల్లాలో అక్షరాస్యత పెరిగింది కూడా. అయితే ఏ కారణాల వల్లనో మళ్ళీ అధికారులు దాని జోలికి పోలేదు. ఇటీవలే మన జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించినట్లు 'లాయర్'లో వచ్చిన వార్త చూసి చాలా సంతోషం కలిగింది. మన బస్సు అదేనా?.. కాదా!.. అన్నది తెలుసుకోవాలన్నా అక్షరాలు తెలిసి ఉండాలి కదా!. కనీసం అక్షరజ్ఞానం లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద వయోజనులు జిల్లా వ్యాప్తంగా ఎందరో ఉన్నారు. వారందరికీ అక్షరపాఠాలు నేర్పాలి. ఇదెంతో పవిత్రమైన కర్తవ్యం. కుటుంబాన్ని ఎంతో కష్టపడి పోషించే అనేకమంది కుటుంబపెద్దలు అప్పట్లో చదువులపై కంటే కుటుంబాన్ని ఎలా పోషించాలన్న విషయంపైనే శ్రద్ధ చూపేవారు. ఇప్పుడు అలాంటి పెద్దలకు చదువు చెప్పడం, వారిని న్యూనత పరచకుండా అందరూ వారి చదువుల పట్ల శ్రద్ధ చూపాలి. జిల్లాలో అక్షరదీపాలు మళ్ళీ వెలగాలి. అందుకు సమాయత్తమవుతున్న మన జిల్లా యంత్రాంగానికి నా అభినందనలు!...

కె.పార్థసారథి, ఇందుకూరుపేట.

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# రోత రోడ్లు..ఇక బాగుపడవా?..

నెల్లూరు నగరంలో ఇటీవల కురుస్తున్న చిన్న వానలకే రోడ్లన్నీ చీదరగా తయారయ్యాయి. దసరా ఉత్సవాలకు గుళ్ళకు వెళ్ళే వేలాదిమంది ప్రజలు ఈ రోడ్లను చూసి అసహ్యించుకుంటున్నారు. దర్గామిట్టలో శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి ఈ నవరాత్రి రోజుల్లో భక్తులు ఒక ప్రవాహంలా వచ్చారు. అయ్యప్పగుడి నుంచి ట్రంకురోడ్డు దాకా ఉన్న ప్రధాన రహదారిలో మహనీయుల విగ్రహాలున్న ప్రాంతాలు గుంతలు పడిపోయి ఉన్నాయి. అధికారులు, ప్రముఖులు, నాయకులు అందరూ కార్లలో ఈ దారిలోనే పోతుంటారు కానీ, వాటి దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ గుంతల వల్ల ద్విచక్ర వాహనాల్లో రాకపోకలకు ఎంత కష్టమో చెప్పలేం. ఇక అమ్మవారి భక్తులకు పాదరక్షలు లేకుండా నడిచేవారికి ఎంత ఇబ్బందో చూడండి!.. ప్రధానమైన రోడ్డే ఇంత దయనీయంగా ఉండడం దారుణం. వానొచ్చినప్పుడల్లా దర్గామిట్ట, అయ్యప్ప గుడి సెంటర్, కరెంటాఫీస్ సెంటర్, పొదలకూరు రోడ్డు, పోస్టల్‌కాలనీ, జడ్జీకాలనీ.. ఇలా అన్ని వీధులు గుంతలు పడిపోతున్నాయి. కనీసం ప్యాచ్‌వర్క్‌లన్నా చేయించలేరా?..

ఎం.సులోచన, నెల్లూరు.





## ఆత్మీయ ఉత్సవం... అభినందనోత్సవం

# ఉక్కిరి బిక్కిరైన వెంకయ్య

*ఆత్మీయుల ఆదరస్వాగతాలు, చిరునవ్వులతో పలకరింపులు, అభిమానుల జేజేలు, జిల్లా ప్రజలు-ప్రముఖుల ఆత్మీయ అభినందనలతో మన వెంకయ్య ఉక్కిరి బిక్కిరయ్యారు. భారత 13వ ఉప రాష్ట్రపతిగా అద్వితీయంగా ఆ పదవిని నిర్వహించి, పదవీ విరమణ తర్వాత తొలిసారిగా తమ పుట్టినిల్లయిన నెల్లూరుకు చేరుకోవడంతో జిల్లా ప్రజలు ఆయనకు నీరాజనాలు పట్టారు. అడుగడుగునా పార్టీ కార్యకర్తలు 'జై భారత్‌మాతా', 'వందేమాతరం'..అంటూ తెలుగుజాతికే గర్వకారణమైన మన సింహపురి కన్నబిడ్డ..భరతమాత ముద్దుబిడ్డ వెంకయ్యను జయజయ ధ్వానాలతో స్వాగతించారు. అభిమానులు ఆయనకు చేయెత్తి జైకొట్టారు. ప్రత్యేకించి నెల్లూరులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఆయన మీద తమకున్న అభిమానానికి గుర్తుగా వేలాదిమంది ప్రజల సమక్షంలో..మేళతాళాలు, మంగళవాద్యాలతో క్రేన్‌తో పట్టుకొచ్చిన ఓ పేద్ద గజమాలను తీసుకొచ్చి ఆయన్ను ఎంతో గొప్పగా సన్మానించడం ఓ అద్భుతం!.. పెద్దసంఖ్యలో మహిళలు గుమ్మడికాయలతో..కర్పూరహారతులతో వెంకయ్యను స్వాగతించడం..ఓ అపురూప సన్నివేశం.*

'ఏ దేశమేగినా..ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా..ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి..భూమి భారతిని
నిలపరా నీ జాతి..నిండు గౌరవము!'

అన్న మహాకవి రాయప్రోలు సుబ్బారావు దేశభక్తి గీతంలోని ఈ మాటలకు నిండైన ప్రతీక మన వెంకయ్య. ఎక్కడున్నా దేశ గౌరవాన్ని చాటే పతాక.. మన వెంకయ్య. తాను ఏ పదవిలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా.. ఏ స్థాయిలో ఉన్నా ఆయన నోటి నుంచి వచ్చేది భరతమాత ప్రస్తావనే. దేశాభ్యున్నతే ధ్యేయంగా అందరూ పాటు పడాలని, కన్నతల్లిని-జన్మభూమిని-మాతృభాషను ఎవరూ విస్మరించకూడదనే మాటలు చెప్పకుండా ఆయన ఏ ప్రసంగం పూర్తికాదు. అంతటి దేశభక్తి, గుండెనిండా చిత్తశుద్ధి కలిగిన అరుదైన నాయకుల్లో.. అగ్రగణ్యులని చెప్పదగ్గవారు.. చెప్పుకో దగ్గవారు మన వెంకయ్య. తాను శాసన సభలో సభ్యునిగా ఉన్నా, దేశంలో అత్యున్నతమైన ఉప రాష్ట్రపతి పదవిలో ఉన్నా సరే, ఎప్పుడెప్పుడు నెల్లూరును చూద్దామా.. మనవాళ్ళందరితో కలిసి ఉందామా అన్న ధ్యాసే ఆయనది. పుట్టినూరు..నెల్లూరంటే ఆయనకంత ఇష్టం. జిల్లా ప్రజలకు కూడా ఆయనంటే ఎంతో ఇష్టం. విద్యార్థి దశలో ఉద్యమాలు చేసినా, అసెంబ్లీ టైగర్‌గా ఉన్నా, కేంద్రంలో మంత్రిగా ఉన్నా.. ఆయనకు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం. రాష్ట్రం నుంచి కేంద్రం నుంచి ఎన్నో బృహత్తరమైన సంస్థలను మన రాష్ట్రంలో పెట్టించి, అనేకరంగాల్లో..ముఖ్యంగా విద్య వైద్యరంగాలకు ఆయన చేసిన సేవలు అపారం..అపూర్వం! దేశవ్యాప్తంగా ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారో లెక్కే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే 'ప్రగతికి మారుపేరు వెంకయ్య'..ఆయన ఎక్కడున్నా ప్రజల అభ్యున్నతి మీదనే ఆలోచనలంతా!..అదే ఆయన్ను ప్రజలకు చేరువ చేసింది. ప్రజలకు అత్యంత ఆత్మీయుడిని చేసింది. సేవాసక్తి, దేశభక్తి, దైవశక్తి, చిత్తశుద్ధి కలగలిసిన నేత మన వెంకయ్య. తానెక్కడున్నా మచ్చలేని మహోన్నత నేతగానే రాణించారు. దేశంలోనే అరుదైన మహనీయమైన వ్యక్తిగా కీర్తి చంద్రికలందుకున్నారు. వెంకటాచలంలో నిరుపేద గ్రామీణ ప్రజల కోసం, వారికి విద్యావసతులు, వైద్య సేవలు అందించడం కోసం ఆయన పడిన తపన అంతా ఇంతా కాదు. 'స్వర్ణభారత్ ట్రస్ట్'తో వెంకటాచలం, నెల్లూరు తదితర ప్రాంతాల్లోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా వేలాది సేవా కార్యక్రమాలు చేయించిన మానవీయమూర్తి ఆయన. అంతేకాదు, మాతృభాషంటే ఎనలేని మమకారం. అమ్మభాషను ఎవరూ మరచి పోకూడదని వెంకయ్య చెప్పినంతగా ఏ భాషాభిమాని కూడా చెప్పి ఉండరు. రాజ్య సభలో..సభ్యులు కూడా తమ ప్రాంతీయ భాషల్లో మాట్లాడే అవకాశం కల్పించింది మన వెంకయ్యే. అంతేకాదు, ఏళ్ళ తరబడిగా ఎక్కడో మైసూరులో మూలుగుతున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి విముక్తి కలిగించి, దానిని కన్నడనాడు నుంచి తెలుగునాడుకు తెప్పించి, మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహాకవి తిక్కన పుట్టిన నెల్లూరు సీమలో ఏర్పాటు చేయించి..తెలుగుకు సరికొత్త వెలుగులు తెచ్చిన ఘనత మన వెంకయ్యదే. ఇలాంటి కార్యక్రమాలెన్నో చేయించిన మహోన్నత నేత ఆయన. అందుకే వెంకయ్య నెల్లూరుకు వస్తున్నారంటే అందరికీ అంత ఆనందం!.. మన వెంకయ్య జిల్లాకు రావడమే ఒక పెద్ద పండుగలా మారింది. ఈ దసరా సంబరాల్లో..వెంకయ్య స్వాగత సంబరాలు కూడా అంబరాన్నంటే విధంగా చేసి జిల్లా ప్రముఖులు, ప్రజలు ఆయనపై తమకున్న ప్రేమను, ఆత్మీయతను మరోసారి చాటుకున్నారు. చరిత్రాత్మకమైన ఆయన మహనీయ సేవలకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## 'న భూతో..న భవిష్యతి' అనే రీతిలో వెంకయ్యకు అపురూప సన్మానం



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు నెల్లూరులో జరిగిన సన్మానం 'న భూతో న భవిష్యతి' అనే రీతిలో వైభవంగా జరిగింది. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సారథ్యంలో, వేలాదిమంది ప్రజల సమక్షంలో.. మేళతాళాలు, మంగళవాద్యాలతో జరిగిన 'గజమాల సన్మానం' అందరికీ ఆనందం తెచ్చింది. క్రేన్‌తో పట్టుకొచ్చిన ఓ పేద్ద గజమాలను తీసుకొచ్చి ఆయన్ను ఎంతో గొప్పగా సన్మానిస్తుంటే అభిమానులు కేరింతలు కొట్టారు. భారత్‌మాతా కీ జై' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. 58 మంది మహిళలు గుమ్మడికాయలతో..కర్పూరహారతులతో వెంకయ్యను స్వాగతించడం..ఓ అపురూప సన్నివేశంగా మారింది. వెంకయ్య-ఉషమ్మ దంపతులను, వారి కుమార్తె దీపావెంకట్‌ను సన్మానించి వెంకయ్యపై వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్య ఎంతో వినమ్రంగా ముకుళితహస్తాలతో అందరికీ తన అభినందనలు తెలియజేయడం అందరినీ ఆకట్టుకుంది.

## ఆనందోత్సవంగా.. అభిమానోత్సవం



ఈనెల 3న నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ వెంకయ్యను ఘనంగా సన్మానించే ఆత్మీయ అభినందనోత్సవానికి వేదికైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలసి, రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆనందోత్సవంగా నిర్వహించారు. దేశంలోని రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవిలో దేశానికి సేవ చేసి, పదవీ విరమణ తర్వాత మొట్టమొదటిసారిగా సొంత జిల్లాకు విచ్చేసిన వెంకయ్యను నాయకులు, ప్రముఖులు, అధికారులు సాదరంగా స్వాగతించారు. వేమిరెడ్డి మాట్లాడుతూ, వెంకయ్యలోని కార్యదీక్షా దక్షతలను, అద్భుతమైన వాగ్ధాటిని, రాజకీయ క్రియాశీలతను వివరించారు. వెంకయ్య రాజకీయ ప్రస్థానంలోని ముఖ్యమైన ఘట్టాలను విశదీకరించారు.

రాజ్యసభ చైర్మన్‌గా, ప్రత్యేకించి పార్లమెంటరీ వ్యవహారాలలో తనకున్న అపార అనుభవంతో సభా కార్యక్రమాలను వెంకయ్యనాయుడు నిర్వహించిన తీరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వారు రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న సమయంలో తాను రాజ్యసభ సభ్యుడిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, నెల్లూరు, తదితర ప్రాంతాలలో 'స్వర్ణ భారత్ ట్రస్ట్' చేసే అనే సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా వెంకయ్యనాయుడు పాలుపంచుకోవడం ఆయనకు సేవాభావం పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఆ ట్రస్ట్ పేదలు, అనాథలను ఆదరిస్తుంటుందని, ప్రత్యేక అవసరాల పిల్లల కోసం పాఠశాలను నిర్వహిస్తుందని, ఎంతోమంది పేద మహిళలకు స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలను అందిస్తోందని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా దీపా వెంకట్ తదితరుల ఆధ్వర్యంలో చేపడుతున్న 'స్వర్ణ భారత్ ట్రస్ట్' సేవలు ఎంతో అభినందనీయమన్నారు. నెల్లూరు జిల్లాను అభివృద్ధి చేసేందుకు అనేక ప్రాజెక్టులకు మంజూరు చేయడంలో కీలకపాత్ర పోషించారు మన వెంకయ్య అంటూ విపిఆర్ కీర్తించారు. ఆయన అపారమైన విజ్ఞాన సంపద, తెలివితేటలు, సమయపాలన, ప్రజాసేవ పట్ల మక్కువ మనందరికీ ఆదర్శనీయమన్నారు. యాస, భాష, వస్త్రధారణలో కూడా తెలుగుతనం ఉట్టిపడుతూ, తెలుగు వారి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారంటూ ఆయన వెంకయ్య నాయుడును కొనియాడారు.











**ఆత్మీయ పలకరింపు**

మూడురోజుల నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఆత్మీయంగా కలసి స్వాగతించి సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, కర్నాటక టిడిపి కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి.



### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని
# దర్శించుకున్న.. ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో వైభవంగా జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాల్లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 2వ తేది ఆదివారం నాడు, మూలా నక్షత్రం రోజు, అందులోనూ శ్రీ సరస్వతి అమ్మవారి అలంకారంతో శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారు దేదీప్యమానంగా వెలిగిపోయిన రోజున అమ్మవారిని దర్శించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. విపిఆర్‌తో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని ఎంపీని స్వాగతించి, అమ్మవారి దర్శనం చేయించారు.

**శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో :**

నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 3న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గాదేవి అలంకారంలో కొలువైవున్న ఈ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. సుడా ఛైర్మెన్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తదితరులు విపిఆర్‌కు ఆలయం వద్ద ఘనస్వాగతం పలికారు.

# రంగనాథుని సేవలో రైల్వే అధికారులు



రైల్వే శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఇటీవల నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ అభయ్‌కుమార్‌రాయ్, డెప్యూటి సిఆర్‌ఎస్ శ్రీనివాసరావు, విజయవాడ డిఆర్‌ఎం శివేంద్రమోహన్, సౌత్‌సెంట్రల్ రైల్వే సిపిఓ నీరజ్ అగర్వాల్, పిఐసిసి సోమేష్‌కుమార్‌లు ఆలయానికి రావడంతో ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారిని సాదరంగా స్వాగతించి పూజలు చేయించారు. ఆలయ ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# విఎస్‌యులో కొత్తగా కంప్యూటర్ విభాగం

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో కొత్తగా కంప్యూటరు సెంటరు ప్రారంభమైంది. విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ఈనెల 1న ఆ విభాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయా నందబాబు, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డైరెక్టర్ డా.ఎం.హుసేనయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# బాపూజీ బాటలో నడవాలి

**- కలెక్టర్ చక్రధర్‌బాబు**



పూజ్య బాపూజీ ఆశయాలు, ఆదర్శాల బాటలో అందరూ నడవాలని, గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అన్నారు. అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని బాటలో పయనిస్తూ దేశపురోభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్‌తోపాటు జేసీ కూర్మనాథ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, డ్వామా పీడీ వెంకట్రావు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గాభవాని, కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

- **11 మందికి మెమోలు**



విధుల్లో అలసత్వంగా వ్యవహరిస్తున్న పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ విజయారావు ఆగ్రహంతో ఉన్నారు. ఈనెల 3న ఆయన ఆకస్మికంగా స్థానిక వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న స్టేషన్ రైటర్ సురేష్‌ను విఆర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఎస్ఐ శ్రీహరితో సహ 11 మంది సిబ్బందికి చార్జిమెమోలు ఇచ్చారు. పోలీసులు అంకితభావంతో పనిచేయాలని, విధుల నిర్వహణలో ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

# ప్రపంచానికే స్ఫూర్తి.. మన బాపూజీ



మహాత్మాగాంధీజీ ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలు నిరుపమానమైనవని నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మెన్ డా.ఎన్. సత్యనారాయణ అన్నారు. అక్టోబరు 2న గాంధీజీ జయంతి, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతుల సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆ మహనీయుల సేవలను గుర్తుచేసుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డీన్ వరప్రసాద్, మ్యాథ్స్ హెచ్‌ఓడి పెంచల రావు, ప్రిన్సిపాల్ శ్రీరాములురెడ్డి, డిజిఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ అధికారుల వితరణ



యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవల్లో భాగంగా ఈనెల 2న నగరంలోని కొండాయపాళెం వాత్సల్య అనాథాశ్రమానికి ఆ బ్యాంక్ అధికారులు గ్యాస్‌స్టవ్, గ్రైండర్‌లను వితరణగా అందజేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులకు న్యాయవ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ జోగారావు, నెల్లూరు చీఫ్‌మేనేజర్ అంకయ్య, శ్రీనివాసరావుతో పాటు వాత్సల్య విద్యార్థులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డికి కొత్త బాధ్యత



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వైకాపా కేంద్ర కార్యాలయం కొత్త బాధ్యతను అప్పగించింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ పరిశీలకునిగా ఆయన్ను నియమిస్తూ, ఉమ్మడి నెల్లూరుజిల్లా ఎన్నికలను పర్యవేక్షించాల్సిందిగా పార్టీ సూచించింది. పట్టభద్రుల అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా పి.చంద్రశేఖర్‌రెడ్డి పేర్లను పార్టీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# రక్తదానానికి యువత ముందుకు రావాలి

**- రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు**



రాష్ట్రంలో రక్తం నిల్వల కొరత ఎక్కువగా ఉందని, అందువల్ల పేదరోగులకు అత్యవసర సమయాల్లో వారిని కాపాడేందుకు రక్తం ఎంతో అవసరమని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆదుకోవాలని రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డా.జిజి జోలీ పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రక్తదానం విశిష్టతను వివరించారు. రెడ్‌క్రాస్ రక్తనిధికి రాష్ట్రస్థాయిలో మంచి పేరుందని, జిల్లాలో ఎలాంటి విపత్తులు ఎదురైనా బాధితులను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ముందుంటోందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిపిఓ ఎం.ధనలక్ష్మి కొనియాడారు. ఈ సందర్భంగా ఎక్కువసార్లు రక్తదానం చేయించిన దాదాపు 135 మంది మోటివేటర్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారి సేవలను అభినందించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు డి.రవిప్రకాష్, యడవల్లి సురేష్, దాసరి రాజేంద్రప్రసాద్, రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు, శ్రీ రంజని కో-కన్వీనర్లు ఏ.వి రమణయ్య పాల్గొన్నారు.

# విదేశీ విద్యాదీవెనకు..31దాకా గడువు

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకునేవారికి ప్రభుత్వం అక్టోబరు 31వ తేది వరకు గడువును పొడిగించింది. వార్షికాదాయం 8 లక్షల లోపు ఉండి, విదేశీ విద్యార్హత పరీక్షల్లో స్కోర్ సాధించిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలని, దీనిద్వారా విదేశాల్లో పీజీ, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులు చదువుకోవచ్చని జిల్లా సాధికారత అధికారి వై.వెంకటయ్య తెలిపారు. ఈ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని, జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# గాంధీజీకి..చేవూరు నివాళి



అక్టోబరు 2న జాతిపిత మహాత్మా గాంధీజీ 153వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, శాంతి,అహింసలే ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్ముడు విజయం సాధించారంటూ గాంధీజీ సేవలను కొనియాడారు. గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా, దేశానికి వారు చేసిన సేవలను, వారి గొప్పతనాన్ని కొనియాడారు. డిసిసి ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, నాయకులు ఏటూరి శ్రీనివాసరెడ్డి, పిసిసి కార్యదర్శి మోహన్‌రెడ్డి, సిటీ ఇన్‌చార్జి ఫయాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్‌బాబు, మైనారిటీ నాయకులు ఖాజా మస్తాన్, అల్లావుద్దీన్, ఎస్సీసెల్ నాయకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.




### ఎమ్మెల్సీ ఎన్నికలకు..

# ఓటు నమోదు చేసుకోండి



కలెక్టర్ చక్రధర్‌బాబు

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 4న కలెక్టర్ తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఈనెల 1న భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. అర్హత ఉన్నవారంతా పాత ఓట్లతో సంబంధం లేకుండా కొత్తగా ఓటు నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఓటరుగా నమోదయ్యేవారు జిల్లా నివాసి అయివుండాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. పట్టభద్రుల నియోజక వర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు 2019 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తి అయినవారు మాత్రమే అర్హులని, ఉపాధ్యాయులకు సంబంధించి 2016 నవంబరు 1 నుంచి 2022 అక్టోబరు 31 వరకు ఆరేళ్ల కాలంలో మూడేళ్ళు పనిచేసిన అసిస్టెంట్ పోస్టుకు సమాన విద్యార్హతలు కలిగిన స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు. నవంబరు 7వ తేదీలోగా పట్టభద్రులు ఫారం-18ని, ఉపాధ్యాయులు ఫారం-19ని పూర్తిచేసి సమీపంలో ఉన్న తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఇఓ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. లేదా సంబంధిత వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అభ్యంతరాలను పరిశీలించి డిసెంబరు 30న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని వివరించారు.

### మౌలాలి దర్గాకు..

# లక్ష రూపాయల విరాళం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న దాతృత్వం



కులమతాలతో నిమిత్తం లేకుండా, అడిగినవారికి కాదనకుండా, ఆపన్నులకు లేదనకుండా సాయం చేసే దానగుణం ఉన్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పోతిరెడ్డిపాళెం శ్రీవాణి నగర్‌లో మౌలాలి దర్గా నిర్మాణం కోసం తమను సాయమడిగిన ముస్లిమ్ సోదరులకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఇటీవల ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పోతిరెడ్డిపాళెం వెళ్ళినప్పుడు వారు దర్గా నిర్మాణానికి ప్రసన్నను ఆర్థికసాయం కోరారు. దీంతో ఆయన నెల్లూరులోని తన నివాసంలో, తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ విరాళాన్ని దర్గా కమిటీ వారికి అందించారు. అదేవిధంగా, కోవూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బ ప్రాంతంలో మరమ్మతులకు గురైవున్న ఓ చర్చిని బాగుచేయించేందుకు ట్రస్ట్ ద్వారా 50వేల రూపాయల సాయం ప్రకటించారు.

### చిన్నారులకు చేయూత

గుమ్మళ్ళదిబ్బలో ఇటీవల కరోనాకు గురై మృతిచెందిన కుటుంబానికి చెందిన బైనా బిందు-దాక్షాయణిల సంక్షేమం కోసం వారిద్దరి పేర్లతో 50వేల రూపాయలను, తలపల ప్రణయ్, నందిత లక్ష్మి అనే చిన్నారులకు సాయంగా 60వేల రూపాయలను బ్యాంక్‌లో వేసి ఆ బాండ్లను వారికి అందజేశారు. అదేవిధంగా, కోవూరు మండలంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన దుర్గలూరు అనిత, విడవలూరు మండలం చంద్రశేఖరపురం ఎస్టీ కాలనీకి చెందిన పాలెపు రమణయ్యలకు ట్రస్ట్ ద్వారా ట్రైసైకిళ్ళు అందజేసి తమ సేవా భావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎఎబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వైకాపా కోవూరు మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, విడవలూరు మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, రామచంద్రాపురం సర్పంచ్ శీను తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలను.. పూర్తిస్థాయిలో నివారించాలి

### పోలీసులకు జిల్లా ఎస్పీ ఆదేశం



జిల్లాలో అక్రమ కార్యకలాపాలను నిరోధించాలని, అక్రమార్కులు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే నాటుసారాను జిల్లాలో పూర్తిస్థాయిలో నివారించేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని, సారా రహిత జిల్లాయే లక్ష్యంగా కృషిచేయాలని చెప్పారు. ఈనెల 4న నెల్లూరులోని పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, సెబ్ జేడీ శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలో జిల్లా నేరసమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వగైరాలతో పాటు ఇసుక, మద్యం, ఎర్రచందనం తదితర అక్రమరవాణాలను అరికట్టాలని చెప్పారు. గుట్కా నిల్వలు, రవాణాలపై నిఘా పెంచాలన్నారు. విధుల్లో అలసత్వం వహించకుండా, మత్తు పదార్ధాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సెబ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఏఇఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డేవిస్‌పేటలో ఇల్లిల్లూ తిరిగిన ప్రసన్న



కోవూరు నియోజక వర్గంలోని ఇందుకూరు పేట మండలం డేవిస్ పేటలో ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ఆయన 'గడప గడపకు' తిరుగుతూ ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా విశదీకరించారు. ఈ మూడేళ్ల కాలంలో ఈ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన అన్ని వర్గాల ప్రజలకు తెలియజేశారు.

# 'నుడా' వీసీగా..బాపిరెడ్డి



తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా పనిచేస్తున్న టి.బాపిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వైస్‌ఛైర్మెన్‌గా నియమిస్తూ ఉత్తర్వు లిచ్చింది. ఇప్పటిదాకా వీసీగా ఉన్న నందన్ నుడా కార్యదర్శిగా కొనసాగనున్నారు. వివాద రహితునిగా, సీనియర్ అధికారిగా ఉత్తమ సేవలందిస్తూ మంచిపేరు తెచ్చుకున్న బాపిరెడ్డి, గతంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కూడా పనిచేశారు. అనంతరం జడ్పీ సిఇఓగా, ఆత్మకూరు ఆర్డీఓగా, డిపిఓగా, డ్వామా పీడీగా, ఐసిడిఎస్ పీడీగా విశేషసేవలందించారు. కోవిడ్ సమయంలో పెద్దాసుపత్రి నోడల్ అధికారిగా కూడా ఉన్నారు. ఆ తర్వాత జిల్లా సంయుక్త కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు. గతంలో మంత్రి ఓఎస్డీగా కూడా పనిచేశారు. జిల్లా పునర్విభజనలో భాగంగా అన్నమయ్య జిల్లా ఆర్డీఓగా నియమితులై, ఆ తర్వాత తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా బదిలీ అయి వచ్చారు. ఇప్పుడు నుడా వీసీగా నియమితులయ్యారు.

# 'తంగిరాల మహాభారతం' 24వ భాగం




సత్యవతి తన కొడుకైన కృష్ణ ద్వైపాయనుణ్ణి అంబిక, అంబాలికలకు కుమారులని ప్రసాదించమని కోరినప్పుడు, కృష్ణద్వైపాయనుడు వారిద్దరూ ఒక్క సంవత్సరం తాను ఉపదేశించిన వ్రతం చేసి మనసును శుభ్రపరచుకోవాలెనని, అప్పుడు వారికి నా వలన కౌరవ వంశోద్ధారకులు జన్మిస్తారని అంటాడు. కానీ సత్యవతి అంత సమయం లేదని, రాజు లేకపోతే రాజ్యమంతా అరాచకం ఏర్పడుతుందని అంటుంది. సరే అని అంగీకరించి, వాళ్ళు తన వికృత రూపం, వేషం, దుర్గంధం భరించాలని, తనని చక్కగా సేవించుకోవాలని కఠిన నియమం పెడతాడు.

సత్యవతి మొదట అంబికా దగ్గరకు వెళ్లి బుజ్జగించి కృష్ణ ద్వైపాయనుని దగ్గరకు పంపుతుంది. ఆయన్ను చూడగానే, భయపడిపోయి కళ్ళు మూసుకుంటుంది. అందువల్ల ఆమెకు పుట్టు గుడ్డివాడయిన ధృతరాష్ట్రుడు పుడతాడు. తర్వాత అంబాలిక కృష్ణ ద్వైపాయనుని దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన్ని చూసి వెలవెలబోతుంది. తెల్లబోయింది. అందువల్ల ఆమెకు తెల్లని శరీర రంగుతో పాండురాజు పుడతాడు.

సత్యవతి దేవి, అంబికకు ఇంకొక కుమారుని ప్రసాదించమని అడిగినప్పుడు కృష్ణద్వైపాయనుడు ఒప్పుకుంటాడు. కానీ అంబిక తాను పోకుండా తన దాసిని పంపుతుంది. ఆమెకు ధర్మవేత్త అయిన విదురుడు పుడతాడు. విదురుని జన్మ రహస్యమేమిటంటే, మాండవ్యుడు అనే మునీశ్వరుడు చిన్నతనంలో తప్పు చేశాడని యమధర్మరాజు అతనికి ఒక మహారాజు ధనం దొంగతనం చేశాడని కారాగార శిక్ష పడేటట్లు చేస్తాడు. అది తెలుసుకుని మాండవ్యుడు చిన్నపిల్లలు కొంత వయసు వచ్చే వరకు పాపాలు చేసినా పరిగణించకూడదని యమధర్మరాజుని భూలోకంలో జన్మించమని శపిస్తాడు. అతనే విదురుడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.







# వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. చంద్రశేఖర్‌రెడ్డి



తూర్పు రాయలసీమ ప్రాంతానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైకాపా తరపున పోటీ చేసేందుకు నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్, కృష్ణచైతన్య విద్యా సంస్థల అధినేత, ప్రముఖ సమాజసేవకుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఆయన పేరును తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం విశేషం. తొలి నుంచి సమాజసేవాభిలాష కలిగిన చంద్రశేఖర్ రెడ్డి.. ఇటీవలి కాలంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్‌గా ఉత్తమమైన రీతిలో పనిచేస్తూ జిల్లా రెడ్‌క్రాస్‌కు దేశ వ్యాప్తంగా ఖ్యాతి తెస్తున్న విషయం తెలిసిందే. కోవిడ్ సమయంలో రెడ్‌క్రాస్ ద్వారా వేలాదిమంది బాధితులను ఆదుకోవడంలో చంద్రశేఖర్‌రెడ్డి పాత్ర ఎంతో కీలకం కూడా. మరోవైపు నెల్లూరులోని కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్‌గా ఆయన వేలాది మంది విద్యార్థుల భవిత కోసం ఎంతగానో కృషిచేస్తున్నారు కూడా. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి, వైకాపా నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేయడంపట్ల ఉపాధ్యాయవర్గాలు, అనేక విద్యా సంస్థల వారు, చంద్రశేఖర్‌రెడ్డి సన్నిహితులు, సహచరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# 14న యువజనోత్సవాలు

నెల్లూరులోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అక్టోబరు 14న జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరుగనున్నాయి. నగరంలోని టౌన్‌హాల్లో ఈ కార్యక్రమాల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరు విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. చిత్రలేఖనం, గేయ రచన, ఫోటోగ్రఫీ, సాంస్కృతిక నృత్య పోటీలు, వక్తృత్వం, యువసంవాద్ జరుగుతాయని, ఆసక్తి గలవారు వివరాలకు ఫోన్ నంబరు 9963533440లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



# సాయిదర్బార్‌లో నక్షత్రహారతులు

నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాలమందిరంలో శ్రీ షిరిడీ సాయినాథునికి 104వ మహాసమాధి ఆరాధన ఉత్సవాలు ఈనెల 4న ప్రారంభ మయ్యాయి. 6వ తేది దాకా, మూడురోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విశేష హారతులు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో ఆలయ అర్చకులు సాయినాథుని అర్చించారు. బాబా వేషధారణతో పెద్దసంఖ్యలో భక్తులు షిరిడీ సంప్రదాయం ప్రకారం నగరంలోని పలు వీధుల్లో భిక్షాటన నిర్వహించి సాయినాథునికి పూజలు చేసుకున్నారు. అఖండ నామ సంకీర్తన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సాయి సచ్చరిత్ర పారాయణాలతో ఆలయ మార్మోగింది. ప్రత్యేకించి ఈ ఉత్సవాల్లో శ్రీ సాయినాథునికి నక్షత్రహారతులు నయనా నందకరంగా జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, నిర్వాహకులు బాబిసాయి, మహారాజ్ పెంచలసాయి, వెంకటసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు.

### ప్రముఖ కవి నాగరాజును

# అభినందించిన శ్రీసిటీ ఎం.డీ



కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం 2022కి ఎంపికైన పల్లిపట్టు నాగరాజును శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. సత్యవేడు మండలం రాజ గోపాలపురానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు నాగరాజు సమకా లీన సామాజిక సమస్యలను ప్రస్తావించే 52 కవితల సంకలనం 'యాలై పూడిసింది' అనే తెలుగు రచనకు పురస్కారం లభించ డంతో ఇటీవల శ్రీసిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నాగరాజును ఆయన సన్మానించి గౌరవించారు. శ్రీసిటీ పరిసర ప్రాంతానికి చెందిన నాగరాజు అత్యున్నత సాహిత్య గౌరవానికి నామినేట్ కావడం, జాతీయ ఖ్యాతిని పొందడం ఈ ప్రాంత సాహిత్యాభిమానులందరికీ సంతోషకరమైన విషయమన్నారు. భవిష్యత్తులో సాహిత్యరంగంలో అత్యుత్తమ పురస్కారాలు ఆ రచయితకు లభించాలని ఆకాంక్షించారు. హిందూ దినపత్రిక తిరుపతి ప్రత్యేక ప్రతినిధి ఎ.డి రంగరాజన్ మాట్లాడుతూ, నాగరాజు విలక్షణమైన సాహిత్య శైలిని కొనియాడారు. శ్రీసిటీ ప్రెస్ రిలేషన్స్ ఆఫీసర్ డి.రవి, శ్రీసిటీ పీఆర్ఓ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# గాంధీజీ, శాస్త్రీజీలు దేశానికి ఆదర్శం

**కమిషనర్ సాయినాథ్**



జాతిపిత మహాత్మాగాంధి 153వ జయంతి, భారత దేశ రెండవ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి 118వ జయంతిలను గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మా గాంధీ అహింసావాదంతో తెల్లదొరలను తరిమికొట్టి, భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకుని వచ్చారని తెలియజేశారు. లాల్ బహుదూర్‌శాస్త్రి కూడా దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సచివాలయ పరిధిలో శానిటేషన్‌ను సక్రమంగా నిర్వహించిన బాబురావు, శానిటేషన్ మేస్త్రీని కమిషనరు సన్మానించి వారికి బహుమతి ఇవ్వడం జరిగింది.

# ఉపాధ్యాయులకు రోటరీ సత్కారాలు



గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లో ఈ నెల 4వ తేదీ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. రోటరీ అధ్యక్షుడు కిరణ్‌చక్రవర్తి, సెక్రటరీ రవికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశేష సేవలందించిన రొటేరియన్స్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.దశరథరామిరెడ్డి, యల్.వి. రమణబాబు, యస్.వి.నాగేంద్రప్రసాద్, జి.యస్ రాఘవరెడ్డి, పి.నిరంజన్‌రెడ్డి, వై.ప్రభా కర్‌రెడ్డి, ఎస్.బాలక్రిష్ణంరాజు, జి.వి.పవన్‌కుమార్, కె.చంద్రమోహన్, వి.వెంకటేశ్వర్ల రెడ్డిలను సత్కరించారు. బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, కె.మునిగిరీష్, రాంప్రసాద్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ముత్యాల చీరలో ముత్యాలమ్మవారు



దేవీ నవరాత్రుల సందర్భంగా చిల్లకూరు మండలం, తూర్పుకను పూరు నందు వెలిసియున్న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవారు ముత్యాల చీరతో నయనానందకరంగా భక్తు లకు దర్శనమిచ్చారు. ఈ నెల 4న శ్రీ మహిషాసురమర్దినీ అలంకరణ సందర్భంగా అమ్మవారిని ముత్యాల చీరతో అలంకరించారు.

# అమ్మవార్ల దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు



శరన్నవ రాత్రులను పురస్కరించుకుని గూడూరు పట్టణంలో వివిధ అమ్మవార్ల దేవస్థానాల్లో ఈ నెల 3న ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదుర్గాదేవి దేవస్థానంలో దుర్గాదేవిగా, వాలయానందపురంలోని మహాలక్ష్మమ్మ అమ్మవారు కనకదుర్గగా దర్శనమిచ్చారు. ఇతర ఆలయాల్లోనూ అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు కనువిందు చేశారు.

# 14న విజయవాడలో సిపిఐ మహాసభలు



విజయవాడలో ఈ నెల 14న నిర్వహించే సిపిఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆ మహాసభలకు సంబంధించి గోడపత్రికలను ఈనెల 3వ తేదీన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, మస్తానయ్య, జమా లుల్లా తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు పర్యటనకు విచ్చేసిన భారత మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును ఈ నెల 4వ తేదీ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పెర్నాటి న్యాచురల్స్ ఉత్పాదనలను అందజేసిన పెర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పెర్నాటి బిందు, ఐశ్వర్య.

# దివ్యాంగులకు పౌష్టికాహారం



గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 3వ తేదీ డి.రవీంద్రరెడ్డి అధ్యక్షతన లయన్స్ క్లబ్ వైజేపీ ఆధ్వర్యంలో ఎస్.సుబ్రహ్మణ్యంబాబు దాతృత్వంతో కీ॥శే॥ వాటంబేటి వెంకట రామారావు జ్ఞాపకార్థం దివ్యాంగులకు వస్త్రదానం మరియు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అధ్యక్షులు డి.రవీంద్రరెడ్డి, కార్యదర్శి పి.వి.మనోజ్‌కుమార్, ట్రెజరర్ పి.గోపి నాథ్‌రెడ్డి, ఆర్.వి.రావు, రాధాకృష్ణారెడ్డి, బి.సుధాకర్, పి.శివరామ్, వి.జ్యోతి, వి.నాగేంద్ర, కార్తీక, ఎస్.సాయికిశోర్ పాల్గొన్నారు.

# వీకెండ్స్ క్రికెట్ పోటీలు



గూడూరు మండలం, చెన్నూరు గ్రామంలో గూడూరు రూరల్ క్రికెట్ క్లబ్ స్థాపకులు శశాంక్ అధ్వర్యంలో వీకెండ్స్ క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైకాపా నాయకులు విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కొండిదల మునిగిరీష్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శ్రీనివా సులురెడ్డి, రాంగోపాల్, వంశీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలకు పూర్వవైభవం

## - మంత్రి కాకాణి

గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం 'మనం- మన గ్రంథాలయం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇటీవల నిర్వహించిన 'మనం-మన గ్రంథాలయం' కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేషగిరిరావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో గ్రంథాలయ సంస్థలను కేవలం పదవులు భర్తీ చేసేందుకు వాడుకున్నారని, ఎటువంటి విషయ పరిజ్ఞానం లేని వారిని ఛైర్మన్లుగా నియమించడంతో గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్న ముఖ్యమంత్రి, గ్రంథాలయాల పటిష్టతపై కూడా ప్రత్యేకదృష్టి పెట్టారన్నారు. ఈ క్రమంలోనే మనం- మన గ్రంథాలయం పేరిట గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లాకు కోటి రూపాయలను సీఎం మంజూరు చేశారని, దీంతో గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు గ్రంధపాలకులకు అందజేసినట్లు చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించి, వాటి అభివృద్ధికి సహకరించాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకున్న 72 మంది విద్యార్థులు సచివాలయ ఉద్యోగాలు పొందినట్లు మంత్రికి ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది వివరించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని మంత్రి పరిశీలించి, గ్రంథాలయంలో బూజును తనే స్వయంగా శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ శ్రీమతి దొంతు శారద, సెక్రటరీ కె.కుమార్‌రాజా, డెప్యూటీ లైబ్రేరియన్ సిహెచ్ ప్రసాద్, సిబ్బంది విజయ, కేవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీ కలలుగన్న..

## గ్రామస్వరాజ్యం వైపు ప్రభుత్వం అడుగులు

జాతిపిత మహాత్మాగాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అందుకు నాందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ 153వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద బాపూజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, నగర కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆర్డీఓ మాలోల, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కెవి చలమయ్య తదితరులు పాల్గొని జాతిపిత మహాత్మాగాంధీకి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామాలు అభివృద్ధికి పట్టుకొమ్మలని, ప్రజల్లో అసమానతలు తొలగించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తూ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బడుగు బలహీన వర్గాలకు కేటాయించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మనమంతా ఆ మహనీయుని బాటలో నడిచి జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మంత్రి తెలిపారు.

# గాంధీజీ ఆశయాలు మార్గదర్శకం

## - కెవి చలమయ్య



మహాత్మాగాంధీజీ ఆశయాలు అందరికీ మార్గదర్శకం కావాలని నెల్లూరులోని స్వాతంత్ర్య సమరయోధులు, ఆర్యవైశ్య ప్రముఖులు కెవి చలమయ్య చెప్పారు. అక్టోబరు 2న గాంధీజీ జయంతి సందర్భంగా నగరంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ, లాల్‌బహుదూర్‌శాస్త్రిలు దేశానికి సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఆర్‌వి శరత్, సొల్లేటి నాగేశ్వరరావు, నగరకంటి రవీంద్రనాథ్, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు రామకృష్ణ, దర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కోటంబేడులో

# సచివాలయం సముదాయం



తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలో అన్ని వసతులతో కూడిన సచివాలయ సముదాయం ఏర్పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా, గ్రామ స్వరాజ్యం దిశగా ప్రవేశ పెట్టిన నూతన సచివాలయం వ్యవస్థలో భాగంగా దీనిని ఏర్పాటుచేశామని మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ సచివాలయ సముదాయంతో పాటు రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్నెస్ కేంద్రాలకు జడ్పీ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ, తిరుపతి ఎంపి గురుమూర్తి, ఆనం రామనారాయణరెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిలు ఇటీవల ప్రారంభోత్సవాలు చేశారు. వీటితో పాటు, మరో నలభై లక్షల వ్యయంతో చేపట్టనున్న కోటంబేడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. దీని ద్వారా తెలుగుగంగ నీటిని సంపూర్ణ స్థాయిలో ఈ ప్రాంత ప్రజలకు అందిస్తామని ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. కోటంబేడులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. బాలాయపల్లి మండల పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, 'నవరత్నాలు.. వైఎస్ఆర్ సంక్షేమ పథకాల' ద్వారా 40016 మంది లబ్ధిదారులకు 95 కోట్లకు పైగానే మొత్తాన్ని వ్యయం చేశారన్నారు. కోటంబేడులో కొత్త సచివాలయ భవనానికి రూ. 40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ. 21.50 లక్షలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి 17.60 లక్షలు మంజూరుచేయడం జరిగిందన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 45 లక్షలు, జల జీవన్ మిషన్ ద్వారా 5 పనులకు 27 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మండల పరిధిలో 2019 మంది అక్క చెల్లెమ్మలకు 3కోట్లా 78లక్షలా 56వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారని రామనారాయణరెడ్డి వివరించారు.

## ధాన్యం కొనుగోళ్ళు

# సక్రమంగా జరగాలి

### అధికారులకు పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాలు

జిల్లాలోని రైతుల నుండి ధాన్యం సేకరణలో గత రబీలో ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఖరీఫ్ సీజన్లో పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో, 2022-23 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ గురించి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్‌ఛైర్మెన్, ఎండి జి.వీరపాండియన్‌తో కలిసి పౌర సరఫరా శాఖ అధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక చర్యలు తీసుకుంటున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సక్రమంగా అమలు జరిగితేనే రైతుకు లాభం చేకూరుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు ధాన్యం సేకరణకు సమయం ఉన్నందున, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణలో నూతన పద్ధతులు అవలంబించేందుకు విధి విధానాలు రూపకల్పన చేసామని, రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా రైతులకు మేలు జరిగే విధంగా ధాన్యం సేకరణలో టెక్నికల్ అసిస్టెంట్, రూట్ అసిస్టెంట్‌లను నియమిస్తున్నామని వారు చెప్పారు. అవసరమైతే అందుకు సచివాలయ సిబ్బంది సేవలను కూడా వినియోగిస్తామన్నారు. ధాన్యం నాణ్యత పరిశీలన, తూకం వేసి రైతులకు సంబంధిత కాపీని కూడా అందజేయడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, పౌర సరఫరాల సంస్థ డిఎం పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## టూకీగా...

### జమ్మలపాలెం రోడ్డు బాగుచేయండి సారూ!

జలదంకి మండలం జమ్మలపాలెం ఎస్సీకాలనీ రోడ్డు పరమ అధ్వాన్నంగా ఉంది. చిన్న వర్షం వచ్చినా రోడ్డు గుంతల్లో నీళ్లు నడవడంతో రోడ్డంతా కాలువలా ఉంటోందని, నడవడానికి కూడా ఎంతో ఇబ్బందిగా ఉందని, అధికారులు పరిశీలించి శాశ్వత ప్రాతిపదికన సిమెంట్‌రోడ్డు వేయించాలని ఆ కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

### దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్ళు

కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచన మేరకు ఇటీవల వలేటివారిపాలెం మండల పరిషత్ ఆఫీసులో ఆరుగురు దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్ళను అందజేశారు. ఎంపిడిఒ రఫీక్ అహ్మద్‌తో పాటు పలువురు ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### అంకమ్మ గుడికి ముస్లిమ్ భక్తుల విరాళం

చేజర్లలోని అంకమ్మతల్లి గుడికి ముస్లిమ్ భక్తులు సిరాజుద్దీన్-ఎస్‌కె సల్మాన్‌షరీఫ్‌లు ఇటీవల 10,116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. భగవంతుడు అన్ని రూపాల్లో ఉంటాడని, కులమతాల తేడాలు తమకు లేవని వారన్నారు. ఆలయకమిటీ సభ్యులు బొగ్గవరపు సుధాకర్, సుజనారెడ్డి, బూదళ్ళ వీరరాఘవ రెడ్డి, షేక్ రసూల్, షేక్ దావూద్ తదితరులు పాల్గొన్నారు.

### కుట్టుమిషన్ వితరణ

కావలిలోని 'సంయుక్త' సేవాసంస్థ నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణా కేంద్రానికి నెల్లూరుకు చెందిన శ్రీనివాసరావు, లలితలు తమ కుమారుడు జైసాయిరాం భార్గవ్ జ్ఞాపకార్థం కుట్టుమిషన్‌ను వితరణగా అందజేశారు. రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, ఎస్‌కె ఆయేషా, ఎం.అజిత్‌బాబు పాల్గొన్నారు.

### చిన్నారులకు పలకలు..పుస్తకాలు

అక్టోబరు 2న మూలానక్షత్రం, ఈ శరన్నవరాత్రి వేడుకల్లో సరస్వతిదేవి అలంకారంతో అమ్మవారు విరాజిల్లే రోజు కనుక చిన్నారుల చదువులకు శుభప్రదమని కోవూరు గ్రామదేవత నాగవరప్పమ్మ దేవాలయం అర్చకులు సుబ్బరామయ్య చెప్పారు. అనంతరం కె.సుధాకర్‌రెడ్డి దంపతులు (కోవూరు) 400 మంది చిన్నారులకు పలకలు, నోటుపుస్తకాలు, పెన్‌లు బహుకరించారు.

### విద్యుత్ తీగలు పడి.. గేదెలు మృతి

ఉదయగిరి రూరల్‌లోని అప్పసముద్రం గ్రామంలో ఈనెల 3న ప్రమాదవశాత్తూ 11 కెవి విద్యుత్‌తీగలు తెగిపడి రెండు గేదెలు మృతిచెందాయి. మోడి ఆంజనేయులుకి చెందిన గేదెలు పొలాల్లో మేత మేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ గేదెల విలువ రెండులక్షలు ఉంటుందని బాధితుడు వాపోతున్నాడు.

### తాళ్లపూడిలో ఉచిత కంటివైద్యం

ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో ఈనెల 3న సెంబ్ కార్ప్ సంస్థ వారు ఉచిత కంటివైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి సర్పంచ్ మెట్టా వింద్యారెడ్డి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. ఎంపిపి గండవరపు సుగుణ, జడ్పీటీసి వెంకట సుబ్బయ్య, వైకాపా నాయకుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు.

### లక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

విడవలూరు మండలంలోని లక్ష్మీపురంలో శివానంద చికిత్సాలయం ఆధ్వర్యంలో ఈనెల 3న రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపిటిసి బి.శ్రీనివాసులు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అనేకమంది దాతలు రక్తదానం చేశారు.

### వన్యప్రాణుల్ని కాపాడుకోవాలి

వన్యప్రాణుల్ని కాపాడుకోవాలంటూ అటవీ అధికారులు రాపూరు రేంజ్‌లోని అటవీపరిధిలో ప్రజలకు అవగాహన కలిగించారు. ఈనెల 3న వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని అటవీ అధికారులు, రోడ్డుపై ప్రదర్శన నిర్వహించారు.

### ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

రాపూరు యూత్‌క్లబ్, నెహ్రూ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 3న రాపూరు పట్టణంలోని ఆంజనేయపురం ఎస్టీ కాలనీలో పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టారు. రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు.

# మీ అభిమానం.. నిరుపమానం

## - వెంకయ్యనాయుడు



నెల్లూరులో పెద్దఎత్తున కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన తన సన్మానం తనకెంతో ఆనందాన్నిచ్చిందని, మీ అభిమానం నిరుపమానమని'.. వెంకయ్యనాయుడు అన్నారు. తనకు జరిగిన ఆత్మీయ సన్మానం అనం తరం ఆయన మాట్లాడుతూ, ఈ ఆత్మీయ అభినందనోత్సవంలో భాగంగా మిత్రులు ఏర్పాటు చేసిన ర్యాలీకి ప్రజల నుంచి లభించిన స్పందన మరువలేనిదని, 'నన్ను గుండెల్లో పెట్టుకున్నవారి అభిమానం మరువలేనిదని' అన్నారు. నెల్లూరులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర మిత్రులు నిర్వహిం చిన ఆత్మీయ అభినందనోత్సవంలో చిరకాల మిత్రులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, పుర ప్రము ఖులను కలవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన మిత్రులకు అభినందనలన్నారు. పార్టీలకతీతంగా జిల్లా ప్రజలు చూపిన ఆదరాభిమానం, అందిం చిన సహకారం, తోడ్పాటు వల్లనే తాను ఈ రోజు ఉన్నతమైన స్థానలో నిలిచానని ఆయన వినమ్రంగా చెప్పారు. ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించటం, వారి సంక్షేమాన్ని పట్టించుకోవ డమే తనను ఉన్నత స్థాయికి చేర్చిందన్నారు. ఇన్నేళ్ళ అనుభవం నుంచి నేను చెప్పే మాట ఒకటే. 'ఇతర పార్టీలవారు మన ప్రత్యర్థులే గానీ.. శత్రువులు కాదని భావించాలని' ఆయన సూచించి అందరి కరతాళధ్వనులందుకున్నారు.

### వెంకయ్య వ్యక్తిత్వం.. ఆదర్శనీయం

**- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా**

వెంకయ్యనాయుడు వ్యక్తిత్వం, మాతృభూమి సేవ పట్ల అంకిత భావం, ప్రజా జీవితంలో వారి సుదీర్ఘ ప్రస్థానం, అన్నింటికీ మించి పేద, అణగారిన వర్గాలకు సేవ చేయాలన్న వారి అలుపెరు గని ఉత్సాహం ఆదర్శనీయమైనవని ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కొనియాడారు. భారతదేశ ఉపరాష్ట్ర పతిగా పదవీ విరమణ చేసినా తమదైన విలక్షణ మార్గంలో ప్రజలకు ఆయన దగ్గరగానే ఉన్నారని, నేటికీ వారి మార్గదర్శ కత్వం, సలహాలు, సూచనలను స్వాగతిస్తూ, వారి ఆలోచనల నుంచి తాను స్ఫూర్తిని పొందుతూనే ఉన్నానని తెలిపారు.

### సేవతోనే సంతృప్తికర జీవితం - వెంకయ్య

సోమవారం ఉదయం వెంకటాచలంలోని అక్షర విద్యా లయంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో కలసి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. జీవితంలో అన్నీ మనం ఊహించినట్లు జరగవని తెలిపారు. ముఖ్యంగా అధికారానికి మనం దగ్గరగా వెళ్ళే కొలదీ దూరమౌతుందని, దూరంగా జరిగే కొద్దీ దగ్గరవుతుందన్నారు. జీవితంలో ఏదీ ఆశించకుండా పనిచేసుకుంటూ ముందుకు సాగడం వల్ల ప్రశాంతంగా అనుకున్నది చేయగలిగానని, ప్రజలకు చేసిన సేవ అధికారంగా మారి, మరింత సేవ చేసే అవకాశానిచ్చిం దన్నారు. సేవకు తావులేని జీవితం.. రుచి లేని భోజనం లాంటి దన్న వెంకయ్యనాయుడు, ప్రతి ఒక్కరూ జీవితంలో సేవను ఓ భాగంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి దుష్టసంహారానికి చిహ్నమని, అవినీతి లాంటి సామాజిక జాఢ్యా లపై విజయదశమి పోరాట స్ఫూర్తిని రగిలించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీని వాసులు రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్, ప్రముఖ గాయకులు గంగాధర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు, ఓంబిర్లా అక్షర విద్యాలయంలోని స్వామి వివేకానంద, సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆదాల ప్రభాకర రెడ్డి, జిల్లా ఎస్పీ విజయారావు తదితరులు స్వాగతం పలికారు.

### సేద్యంలో సాంకేతికత పెరగాలి

సేద్యం ఎద్దులతో చేసే రోజులు పోయాయని, వ్యవసాయంలో ఇంకా సాంకేతిక, యాంత్రీకరణ పెరగాలని ఈనెల 4న మంగళ వారం పొదలకూరులోని కిసాన్‌క్రాఫ్ట్‌ను సందర్శించిన సందర్భంగా వెంకయ్యనాయుడు చెప్పారు. అనుబంధ పరిశ్రమలతోనే గ్రామీణ సాధికారత సాధ్యమవుతుందన్నారు. స్థానికులకు ఉపాధి కల్పిస్తున్న సంస్థ ఛైర్మెన్ రవీంద్ర అగర్వాల్‌ను ఆయన అభినందించారు. ఆ సంస్థ డైరెక్టర్ సారిక అగర్వాల్, ఎం.డి అంకిత్ చిటాలియా తదితరులు పాల్గొన్నారు.

### పాల్గొన్న ప్రముఖులు

వెంకయ్య మూడురోజుల పర్యటనలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, నగర మేయర్ పోట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, నెల్లూరు గ్రామీణ, కావలి, సూళ్ళూరుపేట, గూడూరు శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి, కిలివెటి సంజీవయ్య, వరప్రసాద్‌రావు, 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఏపి స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, ఏపి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ మేరుగ మురళి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వీడ్కోలు

మూడు రోజుల జిల్లా పర్యటన అనంతరం ముప్పవరపు వెంకయ్యనాయుడుకి వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో అధికారులు, ప్రముఖులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం 6.50 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి ఆయన రైలులో బయల్దేరి తమిళనాడుకు వెళ్లారు.

## జగన్మాత నామస్మరణలతో

# మార్మోగిన ఆలయాలు



జిల్లాలోని ప్రముఖ దేవాలయాలన్నీ నవరాత్రి ఉత్సవాల సందడితో కొత్తకాంతులతో దేదీప్యమానమయ్యాయి. ముఖ్యంగా జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయం, పెంచల కోన ఆలయం, నర్సింహకొండ ఆలయంతో పాటు నెల్లూరు నగరంలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయం, నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం తదితర అనేక దేవాలయాల్లో ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి.

ప్రత్యేకించి నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం జై భవాని.. జైజై భవాని అంటూ.. భవాని మాల ధరిం చిన వందలాదిమంది భక్తులతో క్రిక్కిరిసిపో యింది. ఈసారి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అష్టాదశ శక్తిపీఠాలు భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయదశమి రోజున విశిష్టపూజలు జరిగాయి.

# అటకెక్కనున్న సెంటిమెంటు

(మొదటి పేజీ తరువాయి)

'కొడుకును ముఖ్యమంత్రిని చేయాలన్న ఆలోచనతో పాటు, నడమంత్రపు సిరి, అధికారం, రాజకీయ దురాశ' కేసీఆర్ అవకాశవాదాన్ని పరాకాష్టకు తీసుకెళ్ళాయని విమర్శకులు విశ్లేశిస్తున్నారు.

### ఇక 'మునుగుడే'నా?

భారత రాష్ట్ర సమితి అనే పార్టీ పేరు ప్రకటన సందర్భంగా 'కేసీఆర్ దేశ్‌కి నేత', 'కేసీఆర్... దేశం పిలుస్తోంది రా' అంటూ ఫ్లెక్సీలతో, హోర్డింగ్‌లతో హైదరాబాద్‌ను, తెలంగాణ జిల్లాలను నింపేశారు. అంతటి ప్రభావశీలమైన నాయకత్వం, స్థాయి, ప్రజామోదం ఉంటే, మునుగోడు ఉప ఎన్నికలో ప్రజలు బ్రహ్మరథం పట్టాలి అనే వ్యాఖ్యనాలు వినపడుతున్నాయి. కానీ, అక్కడ ఇప్పటినుండే కొన్ని వందల కోట్లు ఏదో ఒక పథకం పేరు మీద ఖర్చు చేస్తున్నారు. ప్రతి గ్రామానికీ ఒక ఎంఎల్‌ఎని ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రతి వందమంది ఓటర్లకూ ఒక పర్యవేక్షకుడిని పెడుతున్నారు. వీరందరి మీద నిఘా కోసం కొడుకు కేటీఆర్‌ను, మేనల్లుడు హరీష్‌రావును పురమాయించారు. కేసీఆర్ స్వయంగా మునుగోడు వెళుతున్నారు. ఇలాంటి చర్యలతో కేసీఆర్ నాయకత్వంలోని డొల్లతనం బయటపడినట్టయిందని విశ్లేషకులు అంటున్నారు.

ఇంత చేసినా, మునుగోడులో మునుగుడే అనే వారు కూడా లేకపోలేదు. అక్కడ మునిగినా, చావుదప్పి, కన్ను లొట్టబోయి బయటపడినా... కేసీఆర్ దురాశపై తొలి దెబ్బ పడినట్టేనని పరిశీలకుల అంచనా.

మరోవైపు మునుగోడు ఎన్నిక ముగిసిన వెంటనే, సీబీఐ, ఈడీలు దిగేస్తాయి అని కూడా రాజకీయవర్గాలలో గట్టిగా వినిపిస్తున్న మాట. దేశంలోని ప్రతిపక్షాలైన డీఎంకే, బిజు లోక్‌దళ్, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూ, సమాజవాది పార్టీ, ఆప్, ఎన్‌సీపీలలో ఎవరు తన నాయకత్వన్ని సమర్థిస్తున్నారో తెలుసుకోడానికి కేసీఆర్ ఓ ప్రత్యేక విమానంలో వెళ్ళి ఆయా నాయకులను కలిసివచ్చారు. కర్ణాటకలోని కుమారస్వామి తప్ప ఎవరూ ముందుకు రాలేదు. దాంతో, ఏకంగా పార్టీ ఏర్పాటుకే ఆయన తెగించి రంగంలోకి దిగినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

అధికారం, అత్యాశ రెండూ తలకెక్కిన కేసీఆర్... తెలంగాణ వాదాన్ని అటకెక్కించ డంతో, వైసీపీకి, టీడీపీకి తెలంగాణలో ప్రవేశానికి మార్గం సుగమమైందని కూడా ఆయా పార్టీల శ్రేణులు సంబరపడుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలప్పటికే ఆ రెండు పార్టీలు తెలంగాణలో టెంటు పాతే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

తెలంగాణలోని 119 సీట్లలో, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 28 అసెంబ్లీ స్థానాలు, నాలుగు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ప్రతి నియోజకవర్గాన్ని ప్రభావితం చేయగల స్థితిలో తెలుగువారు అక్కడ స్థిరపడి ఉన్నారు. జంట నగరాలలో కేసీఆర్ ఇక మజ్లిస్ పార్టీపైనే ఆధారపడాల్సి ఉంటుంది. తెలంగాణ జిల్లాల్లో కూడా అటు వైసీపీకి, ఇటు టీడీపీకి కేడర్ గట్టిగానే ఉంది. శ్రేయోభిలాషులు, అభిమానులు ఉన్నారు. ఈ పార్టీలను ఇక ముందు 'ఆంధ్ర పార్టీలు' అని అల్లరి చేయడం కుదరదు. కేసీఆర్ ఇతర రాష్ట్రాలకు వెళ్ళడానికి రెడీ అయిపోతున్నప్పుడు, 'ఆంధ్ర పార్టీలు' తెలంగాణకు రాకూడదనే నైతిక హక్కు తెలంగాణ వాదులకు లేదు. ఏతా... వాతా, 2023లో జరగవలసి ఉన్న ఎన్నికల నాటికి కేసీఆర్, తెలంగాణలో రాజకీయంగా పూర్తిగా బలహీనపడిపోవడం తథ్యం అంటున్నారు విశ్లేషకులు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతోనే 'కేసీఆర్ మార్కు రాజకీయాని'కి శుభం కార్డు పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ తరువాత అయిదారు నెలలకు గానీ లోకసభ ఎన్నికలు రావు. లోకసభలో ఉన్న 543 స్థానాలలో గెలిచినవారిలో సగం మంది చేతులు ఎత్తితేగానీ, కేసీఆర్ ప్రధానమంత్రి కాలేరు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న 17 స్థానాలలో టీఆర్ఎస్/ బీఆర్ఎస్‌కు ఉన్నది ఎనిమిది మందే. రేపు, 2024లో వైసీపీ, టీడీపీలు కూడా రంగంలోకి దిగితే... కేసీఆర్ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో ఎవరైనా ఊహించుకోవచ్చు.

కేసీఆర్ దురాశ నేపథ్యంలో మునుగోడు, 2023 అసెంబ్లీ ఎన్నికల మధ్యలో అనేక అనూహ్య రాజకీయ పరిణామాలు కేసీఆరే లక్ష్యంగా చోటు చేసుకోవచ్చని పరిశీలకులు గట్టిగా భావిస్తున్నారు. ఇదే క్రమంలో పనిలోపనిగా హైదరాబాదును యూనియన్ టెరిటరీగా చేసే ఆలోచనను కూడా గట్టిగా తెరపైకి తెచ్చే ప్రయత్నాలు భాజపా ముమ్మరం చేయొచ్చని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు.

'అసలే అవతల మోడీ. ఆయనకు అమిత్ షా జోడీ. చేతిలో ఈడీ. పైపెచ్చు సంజయ్ చేతిలో గాడీ(బండి)... వీరిముందు కేసీఆర్ ఎంత...? బోడి' అంటూ సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి.

కేసీఆర్ అత్యాశకు ప్రేరణ ఏదైనప్పటికీ తెలుగువారు మాత్రం సంతోషించాల్సిందే. 'తెలంగాణలో ఎంట్రీకి ఆంధ్ర పార్టీలకు ఇక పాస్‌పోర్ట్ అవసరం లేదు'.

ఏది ఏమైనప్పటికీ ఒక్క విషయంలో మాత్రం కేసీఆర్‌ను మెచ్చుకోవలసిందే. దక్షిణాది రాష్ట్రాలనుండి ఢిల్లీకి వెళ్ళి చక్రం తిప్పాలనుకున్న ఎంతోమంది నాయకులను తెలుగువారు చూశారు. ఇప్పుడు దేశంలోనే తొలిసారిగా దక్షిణాది రాష్ట్రాలనుండి జాతీయపార్టీ పెట్టిన మొట్టమొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు చంద్రశేఖరరావు. ఆ చరిత్ర చారిత్రాత్మకమవుతుందా లేక మరో మలుపు తీసుకుంటుందా అన్నది మాత్రం వేచి చూడాల్సిందే ...!

### బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీయే! - ఈసీ

టీఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ అయినప్పటికీ, ప్రస్తుతానికి ప్రాంతీయ పార్టీయేనని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసింది. వచ్చే ఎన్నికల్లో అది ఒక ప్రాంతీయపార్టీగా కనీసం నాలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్‌కు, ఆయా అసెంబ్లీలకు పోటీచేసి, 4 ఎంపీ సీట్లు, ఆరు శాతం ఓట్లు తెచ్చుకుంటే, అప్పుడు బీఆర్ఎస్‌ను జాతీయపార్టీగా గుర్తింపు ఇచ్చే విషయం పరిశీలిస్తామని ఎన్నికల సంఘం టీఆర్ఎస్ నేతలకు చెప్పింది. కాబట్టి 'భారత రాష్ట్ర సమితి' కూడా రాబోయే సారస్వతిక ఎన్నికలవరకు ప్రాంతీయ పార్టీయే..!



# ఎన్నికల్లో ఎలా గెలవొచ్చు!?



"ఎన్నికల్లో ఎలాగ గెలవచ్చు?"

"ఎలాగైనా గెలవచ్చు. ఓటుకు ఇంత అని డబ్బులు పారేసి గెలవవచ్చు. పీకల దాకా సారా, బ్రాందీ పోయించి గెలవవచ్చు. క్రికెట్ బ్యాట్లు, కిట్లు, చీరలు, ముక్కు పుడకలు, కుంకుమ భరిణలు ఇచ్చి, బొట్టుపెట్టి గెలవవచ్చు. 'నీది తెనాలే... నాది తెనాలే' అంటూ కులం కార్డుతో గెలవచ్చు. మతం కార్డుతో గెలవచ్చు. రిగ్గింగ్ చేసి గెలవచ్చు. దొంగోట్లు వేయించుకుని గెలవచ్చు. ఓటర్లు పోలింగ్ బూత్‌లకు రాకుండా చేసి గెలవచ్చు. వచ్చినా ఓటేయకుండా చేసి గెలవచ్చు. అసలు వాళ్ళ ప్రమేయం లేకుండా కూడా గెలవచ్చు. ఎవరింట్లో వాళ్ళను బంధించేసి, తలుపులకు బయట గొళ్ళాలు పెట్టేసి గెలవచ్చు.

పోలింగ్ ఏజెంట్లను కొనేసి గెలవచ్చు. లేకపోతే వాళ్ళను ముందు రాత్రి నుంచే 'ఫుల్లు'గా బెదిరేసి గెలవచ్చు. ఎగస్పార్టీ కాండిడేట్‌ను కొనేసుకుని గెలవచ్చు. ఎగస్పార్టీ వాళ్ళ గురించి నిజాలు, మన గురించి అబద్దాలు భారీగా ప్రచారం చేయించి గెలవచ్చు. పుకార్లు వ్యాపింపచేసి గెలవచ్చు. అనుకూలంగా లేని వాళ్ళ ఓట్లు లిస్టుల్లోంచి తీయించేసి గెలవచ్చు.

ఎలక్షన్ కమిషన్‌ను మచ్చిక చేసుకుని గెలవచ్చు.పోలీసోళ్లను వాడుకుని గెలవచ్చు. పోలింగ్ సిబ్బందితో ముందురోజు రాత్రే 'ఫ్రెండ్‌షిప్' చేసి గెలవచ్చు.

పాదయాత్రలు చేసి గెలవచ్చు. కొత్త కొత్త హామీలిచ్చి గెలవవచ్చు. పెద్ద పెద్ద వాళ్ళ పేర్లు చెప్పుకుంటూ ప్రచారం చేసి గెలవచ్చు. ఇంకా చాలా పద్ధతుల ద్వారా ఎన్నికల్లో గెలవచ్చు..."

" అర్రే! ఇన్ని రకాలుగా గెలవచ్చా? అందుకనేనా... మాకు ఇన్ని సీట్లంటే.., మాకు ఇన్ని సీట్లు అని అంటున్నారు!?"

"ఏమో.., ఎందుకంటున్నారో... వారి మనసుల్లో ఏముందో మనకెలా తెలుస్తుంది? విషయం అడిగావు కాబట్టి, నాకు తెలిసింది చెప్పాను.."

"మరి క్యాండేట్ల గుణగణాలు అవసరం లేదా?"

"ఎవరికి?"

"అటు పార్టీలోళ్లకు .... ఇటు ఓటర్లకు...!?"

"లేదు. పొరపాటున కూడా అవసరం లేదు."

"మరి దేన్ని చూసి ఓటు వేస్తారు??"

"ఎవరు...?"

"ఇంకెవరు...? ఓటర్లు!"

"వాళ్లకు కాండిడేట్లతో ఏం పని?"

"డబ్బుల్తో. మందుతో. చీరల్తో. కులంతో. మతంతో. గ్రూపుల్తో. ఏ పార్టీ వాడు ఎంతిస్తాడు అనే బేరీజుతో.."

"మరి ఇప్పుడు – ఆడు అది చెయ్యడం లేదు... ఈడు ఇది చెయ్యడం లేదు అంటూ జనం ఈ యాగీ అంతా ఏంటి మావా?"

"వళ్ళు బలిసి..."

"ఎవరికి..?"

"ఇంకెవరికి? డబ్బుల్తీసుకుని, మందు తాగి, బిర్యానీలు తిని, చీరలు – ముక్కు పుడకలు తీసుకుని, మా కులపోడు అని, మా మతపోడు అని ఓట్లేసిన వాళ్లకి..."

"అయితే, అసలు అడగడమే తప్పంటావా..?"

"తప్పా? తప్పున్నర! అడిగినోళ్లను అడిగినట్టు చెప్పుచ్చుక్కొట్టాలి. అప్పుడేమో ఈళ్లకు డబ్బులు ఇవ్వాలా? మందు పోయించాలా? ఇంట్లో వాళ్లకు గిఫ్టులు ఇవ్వాలా? ఇంట్లో పిల్లల్ని ఎత్తుకుని వాళ్ళ ముక్కుల్లో చీమిడి తీసెయ్యాలా? ముడ్లు కడగాలా? ఇంట్లో వాళ్ళను అక్కా... చెల్లీ... పిన్నీ.. మామ్మా అంటూ ముద్దులు పెట్టుకోవాలా? వంటింట్లోకి వెళ్లి దోశలు వేయాలా? ఇప్పుడేమో అడ్డమైన ఆ పని... ఈ పని చేయాలా? ఏం? ఆళ్ళ కంటికి ఎలా కనపడుతున్నారు జనానికి? వాళ్ళ ఇళ్ల ముందు పేడకళ్ళు ఎత్తేసే పాలేళ్ళ లాగా కనపడుతున్నారా?"

"అది కాదులే మావా...! కోప్పడబాకు. వాళ్ళు కూడా గెలిచాక కాంట్రాక్టులని, ఇసుక అని, మైనింగ్ అని, మట్టి అని, బ్రాందీ.. బార్లు అనీ, స్మగులింగు అని, ట్రాన్ఫర్లు అని, సెటిల్మెంట్లు అని, కబ్జాలు అని, అది అని, ఇది అని, బియ్యం ఎక్స్‌పోర్టు అని, ఇంకేదో అని బాగా సంపాయించుకుంటారు కదా అని ఓటర్లు కూడా అడుగుతున్నారేమోలే మావా...! మనం కూడా ఆలోయించాల గదా!"

'రైటే రా! ఆళ్లకు ఎన్ని ఖైఖర్చులు అనుకున్నావ్? పార్టీ టికెట్ తెచ్చుకున్నందుకు ఖర్చా? ఆ టికెట్ ఇప్పిచ్చినోళ్లకు ఇవ్వాలా? అక్కడ దాకా తీసికెళ్లిన బోకర్లకు ఇవ్వాలా? టికెట్ కోసం పోటీపడి... చివరకు చేతులెత్తేసినోళ్లకు ఇవ్వాలా? జిల్లా నాయకులకు ఇవ్వాలా? నియోజకవర్గంలోని కుల పెద్దలకు ఇవ్వాలా?. మత పెద్దలకు ఇవ్వాలా? గుళ్ళు, గోపురాలు, చర్చిలు, మసీదులు రంగులేయడానికని అడుగుతారు కదా! వాళ్ళకీ ఇవ్వాలా? యువజన సంఘాలోళ్లకు ఇవ్వాలా? స్వచ్ఛంద సంస్థలోళ్లకు ఇవ్వాలా? మళ్ళీ డిపార్ట్‌మెంట్లోళ్లకు ఇవ్వాలా? అయ్యన్నీ ఓ ఎత్తయితే, ఇదొక్కటే ఓ ఎత్తు.






ఇవన్నీ గాక, ఓటుకు ఇంత.... మడిసికింత... ఊరేగింపుకు వస్తే ఇంత... మీటింగ్‌కి వస్తే ఇంత. మధ్యలో చప్పట్లు కొట్టి ఈలలు వేస్తే ఇంత... మీటింగ్ చివరాఖరి దాకా కదలకుండా కూచుంటే ఇంత అని రేట్లున్నాయి గదా. మళ్ళీ ఈ జనాన్ని సప్లై చేసినోళ్లకు ఇవ్వాలా?

ఈళ్ళు గాక, కండ పుష్టి, జబ్బ బలం కలిగిన 'కార్యకర్తల్ని' నామినేషన్ దగ్గిర నుంచి, ఓట్ల పండగ అయ్యేదాకా డైలీ మెయిన్‌టెన్ చెయ్యాలి గదా! వాళ్ళ ఏరియాలో ఉండే చిల్లర మల్లర విలేకరుల్ని, మెయిన్ పేపరోళ్లను, మెయిన్ ఛానలోళ్లను మెయిన్‌టెన్ చెయ్యాలి కదా!

మరి, ఇంతమందిని చూసుకోడానికి ఆళ్ళకు మాత్రం డబ్బులు ఎక్కణ్ణించి వస్తాయ్?

ఆయనెవరో బోడి గుండాయన టీవీల్లో చెబుతున్నట్టు... డబ్బులు చెట్లకు కాయవు గందా!

ఇసకో... మట్టో తవ్వాలి. భూముల్నో, కొండల్నో పిండి చెయ్యాలి. భూముల్ని కబ్జాలు చెయ్యాలి. కమిషన్లు కొట్టాలి. కాంట్రాక్టులు చెయ్యాలి. లేకపోతే, అవి చేసేవాళ్ళ దగ్గర పెర్సెంటేజ్ కొట్టేయాలి. బ్లాక్‌మెయిల్ చెయ్యాలి. ఉత్తరాఖండ్‌లో అయితే... వ్యభిచార గృహాలు కూడా నడుపుతున్నారు, తెల్సా? మనోళ్లు ఇంకా అక్కడిదాకా పోకుండా, చేపల చెరువుల దగ్గరా, పొలంగట్ల మీదా... ఏదో సంసార పక్షంగా పేకాట ఆడించడంతో సరిపెడుతున్నారు."

"అవును మావా...! నాకు తెలవక అడుగుతాను. ఇంత శ్రమపడి, పోటీ చేయడం, ఇంటింటికీ తిరిగి తిట్లు తింటం, అందరికీ డబ్బులు పంచడం దేనికి? అడ్డమైనోడికీ వంగొంగి సలాం చేయడం ఎందుకు? ఉన్న డబ్బుల్తో దర్జాగా... పెద్ద మనుషుల్లా గౌరవంగా బతకొచ్చుగా... ఏదో ఓ వ్యాపారం చేసుకుంటూ?"

"మరిప్పుడు ఆళ్ళు చేస్తున్నదేంటని అనుకున్నావ్? అదే...!"

"ఏంటీ! వ్యాపారమా?! ఇదేం వ్యాపారం మావా?"

"అదే మరి ఇందులోనే ఉంది మజా! దీనికి చదువవసరం లేదు. బుద్ధి గ్యానం అంతకంటే అవసరం లేదు. బిగినింగ్‌లో పెట్టుబడి కూడా పెద్దగా అవసరం లేదు. కాకపోతే, జనం మీద పడి బతికే టాలెంట్ ఉండాలి. ఎంత బేవర్స్‌గా తిరిగితే అంత కోలిఫికేషను ఉన్నట్టు అనుకో. మామూలు వ్యాపారాలకు ఇవి పని చేయవుగా...

ఈ లక్షణాలు ఉన్నాయని పసిగట్టగానే... ఏదో ఓ పార్టీ వారు టికెట్ ఇస్తారు. టికెట్ వచ్చిందని తెలియగానే పోలోమంటూ చందాలు వచ్చి పడిపోతాయి. పలుకుబడి పెరిగిపోతుంది. గ్లామర్ వస్తది. చుట్టూ మన లాటి బేవర్స్ జనం పోగవుతారు.

వరస కుదిరితే, ఎక్కడికో వెళ్లిపోవచ్చు. వరస కుదరకపోయినా... రెండు మూడు తరాలకు ఇబ్బంది లేదు. అందుకే.... రాజకీయ వ్యాపారం అన్ని వ్యాపారాల్లోకి బెస్టు అనేది. ఇందులో నీకు లేబర్ ప్రాబ్లెమ్ లేదు. కరెంట్ బిల్లుల గోల లేదు. ఆఫీసర్లకు మంత్లీ మామూళ్ల గొడవలేదు. పోలీసులతో పేచీ లేదు. కొనుగోళ్లు లేవు. అమ్మకాలు లేవు. ఇన్‌కమింగే తప్ప, ఔట్ గోయింగ్ లేదు. పైపెచ్చు ఆఫీసర్లే చెబుతారు, ఎందులో ఎంత మెలికేసి పిండుకోవచ్చో..."

"మరి చదువుకోనోళ్లు, గూండాలు, రౌడీలు, ఇసక బొక్కేవాళ్ళు, భూకబ్జాలు చేసేవాళ్ళు, మట్టిని, కొండల్ని తవ్వేసే వాళ్ళు, లిక్కర్ సిండికేట్లోళ్ళు, దొంగ వ్యాపారాలు చేసేటోళ్లు రాజకీయాల్లోకి దూరేస్తే.... మరి చదువుకున్నోళ్లు, శుభ్రమైనోళ్లు ఏం చేస్తున్నారు?"

"కేవీపీ రామచంద్రరావు లాగా టీవీలు చూట్టం మానేసి మనవళ్ళు, మనవరాళ్ళతో ఆడుకుంటున్నారు.

మన రాయిమండ్రి పాత ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ లాగా ఏమీ చెయ్యలేక, ఏమీ చేయకుండా ఉండనూ లేక.... పదిహేను రోజులకో, నెలకో ఓసారి ప్రెస్సోళ్లను పిలిచి కడుపు చించుకుంటున్నారు.

సత్తా ఎలా చాటాలో అర్థం కాని మన జయప్రకాశ్ నారాయణ్ లాటి వారు ఇంటి పట్టునే కూచ్చుని...వీడియోల్లోనే తమ కోపాన్ని, అసహనాన్ని, ఆవేదనని, ఆందోళనని, ఆవేశాన్ని వెళ్ళగక్కుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. పట్టి వసంతకుమార్ లాగా, నియోజకవర్గాలను వదిలేసి ఏ విశాఖపట్నంలోనో అజ్ఞాతవాసం చేస్తున్నారు.

"ఇదన్న మాట... ఎలక్షన్ అంటే? సరే గానీ... ఈసారి ఎవరు గెలుస్తారు మావా..?"

"నీకెందుకు?"

"మనకూ చదువు.. చట్టు బందలూ లేవు గదా. పైగా వెనకాల తిరగడానికి బోల్డు మంది మా కులపోళ్ళు, పనీ పాటా లేని పోరంబోకులు బోలెడు మంది ఉన్నారు. గెలిచే పార్టీ ఏదో చెబితే, టికెట్ కొనుక్కుని పోటీచేస్తే... ఎట్టా ఉంటుందా అని...! అందుకే...., ఇంట్రస్ట్ కొద్దీ అడుగుతున్నా.

"చెబితే నాకేమిస్తావ్?"

**- భోగాది వేంకట రాయుడు**



## జర్నలిస్ట్‌కు సత్కారం

ప్రముఖ జర్నలిస్ట్ డాక్టర్ నాగభూషణం కొప్పోలు ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ప్రముఖ అడ్వకేట్ పిసి కృష్ణయ్య, పి.చెంచులక్ష్మిలు ఈ నెల 5వ తేదీ ఆత్మీయంగా కలిసి ఆయనను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు అడ్వకేట్స్ వి.చంద్రికాదేవి, పిసి కృష్ణ ప్రియాంకాదేవిలు పాల్గొన్నారు.

## రెండో విడత 'నాడు-నేడు'

జిల్లావ్యాప్తంగా 1395 పాఠశాలల్లో 'నాడు-నేడు' రెండో విడత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే తొలివిడతలో 1059 పాఠశాలల్లో ఈ పథకం కింద పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. కోవూరు సమీపంలోని ఇనమడుగులో ఉన్న నల్లపరెడ్డి వెంకటకృష్ణారెడ్డి జడ్పీ హైస్కూల్లో చేపడుతున్న నాడు నేడు పనులను ఇటీవల కలెక్టర్ పరిశీలించారు. ఎంపిక చేసిన అంగన్‌వాడి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులతో పాటు మౌలిక సదుపాయలను కూడా కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. అన్ని జిల్లాల కంటే ఎక్కువ పాఠశాలల్లో సుమారు 400 కోట్లను ప్రభుత్వం 'నాడు నేడు' పనులకు కేటాయించిందని చెప్పారు. పాఠశాలల్లోని పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ పనులన్నీ కూడా చేపడుతున్నట్లు చెప్పారు. అధికారులందరూ నాడు-నేడు పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, డిఇఓ రమేష్, ఎంపీడీఓ శ్రీహరి, తహశీల్దార్ పద్మజ, సమగ్ర శిక్ష ఇ.ఇ శ్రావణ్‌కుమార్, హెచ్ఎం వి.రాధారాణి, సర్పంచ్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.

## డాక్టర్ కణ్ణన్‌కు సన్మానం

నేటి తరానికి డా.నటరాజన్ కణ్ణన్ ఎంతో ఆదర్శమని నెల్లూరుజిల్లా నెహ్రూ యువకేంద్ర కో-ఆర్డినేటర్ ఎ.మహేందర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ కణ్ణన్‌కు పీహెచ్‌డి లభించిన సందర్భంగా ఈనెల 4న స్థానిక రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో పట్టాపొందడం కష్టతరమని, అయినప్పటికీ నారాయణ దంత కళాశాలలో హెచ్ఓడీగా విధులు నిర్వహిస్తూ పీహెచ్‌డి సాధించిన డాక్టర్ కణ్ణన్‌ను వైద్య విద్యార్థులు, వైద్యులు మార్గదర్శకంగా తీసుకోవాలని అన్నారు. పిఎంపి అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అనుముల జయప్రకాశ్ మాట్లాడుతూ, డాక్టర్ కణ్ణన్ కోవిడ్ సమయంలోనే కాక, ప్రస్తుతం కూడా ఎందరో పేదలకు ఆర్థిక సహాయం అందచేస్తున్నారని, తెలుగు-ఇంగ్లీష్ భాషల్లో రచనలు చేసి మంచి రచయితగా సుప్రసిద్ధులయ్యారని కొనియాడారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, కార్పొరేటర్ షేక్ సత్తార్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీస్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, కొండాపురం వెంకటేశ్వర్లు, నూర్జహాన్ బేగం, వసుంధర, గోరంట్ల శేషయ్య, సుభహాన్, నారాయణ, మన్సూర్ పాల్గొన్నారు.

# ఉత్తరక్రియలు



## స్వర్గీయ శ్రీ పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి గారు

Ex. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ - సూళ్ళూరుపేట

Ex. ఫార్మర్స్ కో-ఆపరేటివ్ సొసైటి ఛైర్మెన్ - సూళ్ళూరుపేట

జననం : 01-08-1949 మరణం : 18-09-2022

నిజమైన ప్రజానేతకు నిలువెత్తు రూపం మీరు, నీతి నిజాయితీలకు ప్రతిరూపం మీరు,
మంచికి, మానవత్వానికి ఆదర్శంగా నిలిచిన మీ రూపం మా హృదయాలలో సుస్థిరం.
మా అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా దైవం

## శ్రీ పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి గారు

తేది. 18-09-2022 ఆదివారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

బాధాతప్త హృదయాలతో...

ధర్మపత్ని - పెమ్మారెడ్డి ప్రభావతమ్మ

కుమారులు:

పి.మునిచంద్రారెడ్డి, పి.జయచంద్రారెడ్డి, పి.త్రిలోక్‌చంద్రారెడ్డి

మరియు కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు**

తేది. 12-10-2022 బుధవారం రాత్రి **శిలాప్రతిష్ఠ**

తేది. 13-10-2022 గురువారం ఉదయం **బ్రాహ్మణబియ్యాలు**

తిరుపతి జిల్లా, సూళ్ళూరుపేటలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com